RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 144 | జూన్ 23 మంగళవారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 144 | JUN 23 Tuesday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


ఆర్టీఎస్‌పై రాజీ లేదు

2

## భారీ వర్షాలు, పిడుగుల హెచ్చరిక

ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన విపత్తు నిర్వహణ శాఖ



**అమరావతి జనసంఘర్షణ**

ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. వాతావరణంలో సంభవిస్తున్న మార్పుల నేపథ్యంలో ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు విపత్తుల నిర్వహణ సంస్థ 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేసింది. ఈ జిల్లాల్లో వర్షాలతో పాటు గంటకు బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. అలాగే రాయలసీమలోని అనేక ప్రాంతాలతో పాటు పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు

# ఆదిలాబాద్ ఎయిర్ పోర్టుకు పూర్తి సహకారం అందిస్తాం

కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ: ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్, దేవరకద్ర ప్రాజెక్టులపై కీలక చర్చలు

**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ, యుటిలిటీస్ బదలాయింపు వంటి అన్ని అంశాల్లో రాష్ట్రం తరపున పూర్తి సహకారం అందిస్తామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దేశ రాజధాని న్యూఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి, సోమవారం కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ అయ్యారు. దాదాపు 20 నిమిషాల పాటు సాగిన ఈ అత్యున్నత స్థాయి సమావేశంలో రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక రక్షణ, అభివృద్ధి ప్రాజెక్టులపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించారు. హైదరాబాద్‌లోని గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం రక్షణ శాఖకు చెందిన భూములను బదలాయించినందుకు గాను కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆదిలాబాద్‌లో భారతీయ వాయుసేన ఎయిర్‌పోర్ట్‌ను భారీగా విస్తరిస్తున్న నేపథ్యంలో, దేశ సమగ్రత, రక్షణకు సంబంధించిన అంశం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని సీఎం వివరించారు. ఎయిర్‌పోర్ట్ విస్తరణలో వాయుసేన టెర్మినల్‌తో పాటు సామాన్య ప్రయాణికుల సౌకర్యార్థం పౌర విమానయాన శాఖకు చెందిన టెర్మినల్ బిల్డింగ్, కార్గో, హ్యాంగర్ సదుపాయాలు మరియు ఎమ్ఆర్‌వో (వీ=ా – మెయింటెనెన్స్, రిపేర్ అండ్ ఓవర్ హాల్) కేంద్రాలను పెద్దఎత్తున ఏర్పాటు చేసేలా కేంద్ర రక్షణ శాఖ చొరవ చూపాలని కోరారు. ఇటీవల పశ్చిమాసియా (మిడిల్ ఈస్ట్) ప్రాంతంలో చోటుచేసుకున్న భౌగోళిక రాజకీయ పరిణామాల నేపథ్యంలో, అంతర్జాతీయ ఎయిర్‌లైన్స్ సంస్థలు తమ హ్యాంగర్స్ (విమానాల నిలిపివేత, మరమ్మతు



కేంద్రాలు) ఏర్పాటు

➤ మిగతా 2వ పేజీలో..

# ఖతార్‌లో భారీ పేలుడు

మృతుల్లో భారతీయులే ఎక్కువ మంది

**అమరావతి జనసంఘర్షణ**

ఖతార్‌లోని రస్ లఫాన్ గ్యాస్ క్షేత్రంలో సంభవించిన భారీ పేలుడు అంతర్జాతీయంగా ఆందోళన కలిగిస్తోంది. పర్షియన్ గల్ఫ్ తీరంలో, రాజధాని దోహాకు ఈశాన్యంగా దాదాపు 80 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ వ్యూహాత్మక ప్రాంతంలోని బర్జాన్ ప్లాంట్‌లో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ పేలుడు ధాటికి పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడగా.. ప్రమాదంలో 54 మంది తీవ్రంగా గాయపడ్డారు. మరో 18 మంది కార్మికుల ఆచూకీ ఇంకా లభించలేదు. ప్రాణనష్టానికి సంబంధించిన పూర్తి వివరాలు, అలాగే ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. గతంలో ఇరాన్–అమెరికా ఘర్షణల సమయంలో ఐఆర్‌జీసీ దళాలు ఈ ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకుని దాడులు చేయడంతో ఇక్కడ గ్యాస్ ఉత్పత్తి తీవ్రంగా దెబ్బతింది. ఇటీవల ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గడంతో, ఖతార్ ఎనర్జీ సంస్థ ఇక్కడ తిరిగి ఉత్పత్తిని పునరుద్ధరించే పనులను ప్రారంభించిన కొద్దిరోజులకే ఈ దుర్ఘటన జరగడం గమనార్హం. ప్రపంచ గ్యాస్ వాణిజ్యానికి గుండెకాయ లాంటి ఈ రస్ లఫాన్ క్షేత్రం నుంచి భారత్, జపాన్, దక్షిణ కొరియా, చైనా, ఐరోపా సమాఖ్య సహా ప్రపంచవ్యాప్తంగా సుమారు 30కి పైగా దేశాలకు గ్యాస్ ఎగుమతి అవుతోంది. ముఖ్యంగా భారతదేశానికి ఇది ఎంతో కీలకం. భారత్ దిగుమతి చేసుకునే ఎల్ఎన్‌జీలో దాదాపు 40 నుండి 47 శాతం వరకు హర్మూజ్




జలసంధి గుండా ఈ క్షేత్రం నుంచే వస్తోంది. 2024లో భారత్–ఖతార్ మధ్య జరిగిన 78 బిలియన్ డాలర్ల చారిత్రాత్మక ఒప్పందం ప్రకారం.. 2028 నుంచి 20 ఏళ్ల పాటు ఏటా 7.5 మిలియన్ టన్నుల ఎల్ఎన్‌జీని ఖతార్

# సంధ్యా థియేటర్ తొక్కిసలాట కేసు

నాంపల్లి కోర్టుకు హాజరుకాని హీరో అల్లు అర్జున్

**హైదరాబాద్ జనసంఘర్షణ**




హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ సంధ్యా థియేటర్‌లో జరిగిన తొక్కిసలాట కేసు విచారణకు సంబంధించి సినీ నటుడు అల్లు అర్జున్ సోమవారం నాంపల్లి కోర్టుకు హాజరుకాలేదు. సినిమా షూటింగ్ షెడ్యూల్స్ కారణంగా ఆయన రాలేకపోయారని, అందువల్ల వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆయన తరఫు న్యాయవాది న్యాయస్థానాన్ని కోరారు. ఈ కేసులో మొత్తం 23 మందిని నిందితులుగా పేర్కొంటూ పోలీసులు ఛార్జ్‌షీట్ దాఖలు చేయగా,

➤ మిగతా 2వ పేజీలో..

మాస్కోపై వందలాది డ్రోన్లతో

## ఉక్రెయిన్ భీకర దాడులు

**మాస్కో జనసంఘర్షణ**

రష్యాలో విమానాశ్రయాల మూసివేత, క్రిమియాలో ఇంధన సంక్షోభం రష్యాపై ఉక్రెయిన్ తన సైనిక దాడులను మరింత తీవ్రతరం చేసింది. రష్యా రాజధాని మాస్కోతో పాటు దాని పరిసర

➤ మిగతా 2వ పేజీలో..

# ఆంధ్రప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదాలు

**ఐదుగురు దుర్మరణం**

**తిరుపతి జనసంఘర్షణ**

ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాలు తీవ్ర విషాదాన్ని నింపాయి. ప్రకాశం, తిరుపతి జిల్లాల్లో చోటుచేసుకున్న ఈ దుర్ఘటనల్లో మొత్తం ఐదుగురు ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రకాశం జిల్లాలో లారీ–ఆటో ఢీ: ముగ్గురు మృతి ప్రకాశం జిల్లా సంతమాగులూరు

➤ మిగతా 2వ పేజీలో..

# ఆదిలాబాద్ ఎయిర్ పోర్టుకు పూర్తి సహకారం అందిస్తాం

**మొదటిపేజీ తరువాయి..** చేసుకోవడానికి ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ భౌగోళికంగా అత్యంత అనుకూలమైన ప్రాంతమని, ఆ దిశగా దీనిని అరర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు. దీనితో పాటు, మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర సమీపంలో డీఆర్‌డీవో లేదా డీఆర్‌డీఎల్ సంస్థలు ఇప్పటికే ఎంచుకున్న స్థలంలో రక్షణ రంగానికి సంబంధించిన కీలకమైన ప్రాజెక్ట్‌ను సత్వరమే మంజూరు చేసి, పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర రక్షణ మంత్రిని కోరారు. రాష్ట్ర పురోగతికి, జాతీయ రక్షణ రంగానికి ఊతమిచ్చే ఈ ప్రాజెక్టుల విషయంలో కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటుందని ఆశిస్తున్నట్లు సీఎం పేర్కొన్నారు.

# భారీ వర్షాలు, పిడుగుల హెచ్చరిక

**మొదటిపేజీ తరువాయి..** కురిసే అవకాశం ఉంది. కాగా, ఈనెల 23వ తేదీ నాటికి రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల పురోగతి మరింత సానుకూలంగా ఉండనుందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. వాతావరణ పరిస్థితులపై రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ స్పందిస్తూ, ఉరుములు, మెరుపులు వచ్చే సమయంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా పిడుగుపాటు ముప్పు ఎక్కువగా ఉన్నందున వాతావరణం అనుకూలించని సమయంలో ఎట్టిపరిస్థితుల్లోనూ చెట్ల కింద, విద్యుత్ స్తంభాలు, భారీ హోర్డింగ్స్ కింద అలాగే బహిరంగ ప్రదేశాలలో నిలబడవద్దని హెచ్చరించారు. పొలాల్లో పనులు చేసుకునే రైతులు, పశువుల కాపరులు, కూలీలు ముందస్తుగా జాగ్రత్త వహించి సురక్షితమైన పక్కా భవనాలలో ఆశ్రయం పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు. విపత్తుల తీవ్రతను తగ్గించేందుకు యంత్రాంగం క్షేత్రస్థాయిలో సిద్ధంగా ఉందని, ప్రజలు కూడా ప్రభుత్వ సూచనలను పాటిస్తూ సురక్షితంగా ఉండాలని స్పష్టం చేశారు.

## ఖమ్మంలో దారుణం: ఇద్దరు పిల్లలకు విషమిచ్చి తల్లి ఆత్మహత్యా యత్నం

**ఖమ్మం**

భర్తతో జరిగిన చిన్నపాటి వివాదం ఒక కుటుంబంలో ఊహించని పెద్ద విషాదాన్ని నింపింది. ఖమ్మం జిల్లా కేంద్రంలో చోటుచేసుకున్న ఈ ఘోర ఘటనలో ఇద్దరు చిన్నారులు ప్రాణాలు కోల్పోగా, తల్లి ప్రస్తుతం చావుబతుకుల మధ్య ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది.

ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని గుర్రాలపాడుకు చెందిన బొబ్బిలి లింగరాజు, స్వాతి దంపతులు తమ ఇద్దరు కుమారులు వేదక్‌కుమార్ (7), తనీశ్ (4)లతో కలిసి కొద్ది నెలలుగా ఖమ్మం త్రీటౌన్ పరిధిలోని గాంధీనగర్‌లో నివాసం ఉంటున్నారు. లింగరాజు ఒక సెల్‌ఫోన్ షాపులో పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే ఆర్థిక ఇబ్బందుల కారణంగా షాపు యజమాని అతడిని పనిలో నుంచి తీసేస్తున్నట్లు చెప్పాడు. దీంతో ప్రత్యామ్నాయ ఉపాధి కోసం తమ సొంత గ్రామానికి వెళ్లిపోదామని లింగరాజు తన భార్యకు ప్రతిపాదించాడు. కానీ స్వాతి అందుకు నిరాకరించడంతో, గత రెండు రోజులుగా భార్యాభర్తల మధ్య ఈ విషయమై తీవ్రమైన ఘర్షణ జరుగుతోంది.

బిస్కెట్లలో ఎలుకల మందు పెట్టి..

భర్తపై తీవ్ర కోపం పెంచుకున్న స్వాతి, శనివారం ఆయన ఇంట్లో లేని సమయం చూసి బిస్కెట్లకు ఎలుకలమందు పూసి కన్నపిల్లలకు తినిపించింది. ఆ తర్వాత ఏమీ తెలియనట్లు భర్తకు ఫోన్ చేసి పిల్లలకు వాంతులు అవుతున్నాయని, త్వరగా ఇంటికి రావాలని చెప్పింది. కంగారుపడిన లింగరాజు మెడికల్ షాపు నుంచి వాంతుల సిరప్ తెచ్చి పిల్లలకు వేసి పడుకోబెట్టాడు. అయితే విషం తీవ్రత ఎక్కువగా ఉండటంతో పెద్ద కుమారుడు వేదక్‌కుమార్ నిద్రలోనే ప్రాణాలు కోల్పోయాడు. ఆదివారం ఉదయం చిన్న కుమారుడు తనీశ్‌కు కూడా పరిస్థితి విషమించడంతో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు, కానీ అక్కడ చికిత్స పొందుతూ ఆ చిన్నారి కూడా కన్నుమూశాడు.

పిల్లల పరిస్థితి దారుణంగా మారడాన్ని చూసి తట్టుకోలేకపోయిన తల్లి స్వాతి కూడా అదే ఎలుకలమందు తిని ఆత్మహత్యకు యత్నించింది. దీనిని గమనించిన స్థానికులు ఆమెను వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం. ఫాదర్స్ డే (తండ్రుల దినోత్సవం) నాడే ఒక తండ్రి తన ఇద్దరు కన్నపిల్లలను కోల్పోవడం స్థానికంగా అందరినీ కలచివేసింది. ఈ ఘటనపై ఖమ్మం త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని పూర్తిస్థాయిలో దర్యాప్తు జరుపుతున్నారు.

# సంధ్యా థియేటర్ తొక్కిసలాట కేసు

**మొదటిపేజీ తరువాయి..** అందులో అల్లు అర్జున్‌ను 11వ నిందితుడిగా చేర్చారు. థియేటర్ యాజమాన్యానికి చెందిన మొదటి పదిమందితో పాటు మొత్తం 19 మంది నిందితులు సోమవారం వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకావాలంటూ న్యాయస్థానం గతంలోనే సమన్లు జారీ చేసింది. అల్లు అర్జున్ మినహా మిగిలిన నిందితులంతా న్యాయమూర్తి ఎదుట హాజరై బాండ్లపై సంతకాలు చేశారు. హీరో గైర్హాజరుకు గల కారణాలను పరిశీలించిన కోర్టు, తదుపరి విచారణను జూలై 6వ తేదీకి వాయిదా వేసింది.

అసలేం జరిగిందంటే:

2024 డిసెంబర్ 4న 'పుష్ప-2' సినిమా బెనిఫిట్ షో సందర్భంగా సంధ్యా థియేటర్ వద్దకు అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఆ సమయంలో జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ ప్రాణాలు కోల్పోగా, ఆమె కుమారుడు శ్రీతేజ తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంచలన ఘటనపై దర్యాప్తు పూర్తి చేసిన పోలీసులు ఛార్జ్‌షీట్ సమర్పించారు. నిందితుల వ్యక్తిగత హాజరు ప్రక్రియ ముగిసిన తర్వాత ఈ కేసుపై పూర్తిస్థాయి విచారణ ప్రారంభం కానుంది. సినీ, రాజకీయ వర్గాల్లో ఎంతో ఉత్కంఠ రేపుతున్న ఈ కేసులో జూలై 6న జరిగే తదుపరి విచారణ కీలకంగా మారనుంది.

# ఆంధ్రప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదాలు

**మొదటిపేజీ తరువాయి..** మండలం కామేపల్లి రైల్వే అండర్‌పాస్ సమీపంలో జరిగిన ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం వేల్పూరు గ్రామానికి చెందిన 10 మంది ఒక దశదిన కర్మకు హాజరయ్యేందుకు ఆటోలో బయలుదేరారు. కామేపల్లి మలుపు వద్దకు రాగానే, గ్రానైట్ లోడ్‌తో వెళ్తున్న ఒక లారీ వీరి ఆటోను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏడుకొండలు (60), రమణమ్మ (50) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ సుబ్బాయమ్మ (70) అనే వృద్ధురాలు కన్నుమూశారు. గాయపడిన మరో ఏడుగురు ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

తిరుపతి జిల్లాలో ఆర్టీసీ బస్సు, లారీ ఘోర ఢీకొనడం: ఇద్దరు బలి

తిరుపతి జిల్లా పుల్లంపేట మండలం ఉడుంవారిపల్లి వద్ద సోమవారం తెల్లవారుజామున ఆర్టీసీ బస్సును ఒక లారీ ఢీకొట్టింది. తిరుపతి నుంచి కడప వెళ్తున్న ఆర్టీసీ బస్సును, ఎర్రగుంట్ల నుంచి చెన్నై వైపు వెళ్తున్న లారీ బలంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది.

ఈ ప్రమాద తీవ్రతకు ప్రయాణికుల చేతులు, కాళ్లు తెగిపడి రోడ్డు రక్తసిక్తంగా మారింది. ఒక చిన్నారి విరిగిన చేతిని కూడా అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఈ దుర్ఘటనలో ఏడాది వయసున్న చిన్నారి ఘటనా స్థలంలోనే మరణించగా, సుమారు 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. కోడూరు రూరల్ పోలీసులు, అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను మొదట రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ జస్విక (16) అనే బాలిక ప్రాణాలు కోల్పోయింది.

## రైతులను ఇబ్బంది పెఎడితే చర్యలు

**యూరియా ఎమ్మార్పీ ధరలకే అమ్మాలి**

**వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు హెచ్చరిక**

**అమరావతి, :** రైతులను ఇబ్బంది పెడితే డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, కంపెనీలపై కూడా చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు హెచ్చరించారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో ఖరీఫ్-2026 ఎరువుల లభ్యత, పంపిణీపై మంత్రి సమీక్ష నిర్వహించారు. వ్యవసాయశాఖ అధికారులు, ఎరువుల కంపెనీ, అసోషియేషన్ సభ్యులతో సమావేశమయ్యారు. యూరియా, డీఏపీతో కాంప్లెక్స్ ఎరువుల బలవంతపు విక్రయాలు ఆపాలన్నారు. రైతులకు అవసరమైన ఎరువులనే అందించాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో అవసరమైన మేర కన్నా అధిక ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని మంత్రి చెప్పారు. యూరియా సరఫరాలో ఎలాంటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎరువుల బుకింగ్ యాప్ నిర్వహణ సజావుగా ఉండాలన్నారు. నానో యూరియా ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సహజ వ్యవసాయంపై రైతుల్లో ఆసక్తి పెరుగుతోందని తెలిపారు. సాధ్యమైనంత మేర రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలని, అధిక ఎరువుల వినియోగంపై రైతులు అప్రమత్తంగా ఉండాలని వెల్లడించారు. ఎమ్ఆర్‌పీ ధరకే యూరియాను విక్రయించాలని, ఎమ్ఆర్‌పీకి మించి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని డీలర్లకు మంత్రి హెచ్చరిక జారీ చేశారు. యూరియా పక్కదారి పట్టకుండా ప్రత్యేక విజిలెన్స్ బృందాలు ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఎరువుల బస్తాకు పూర్తి లెక్క ఉండాలన్నారు. గతంలోలా అక్రమాలు, ఇబ్బందులు సృష్టిస్తే ఉపేక్షించబోమని.. రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని మంత్రి అచ్చెన్నాయుడు

# ఖతార్‌లో భారీ పేలుడు

**మొదటిపేజీ తరువాయి..** భారత్‌కు సరఫరా చేయాల్సి ఉంది. అమెరికా, ఆఫ్రికా దేశాలతో పోలిస్తే ఖతార్ నుండి గ్యాస్ దిగుమతి చేసుకోవడం భారతదేశానికి ఎంతో చౌకైన మార్గం. దేశీయంగా విద్యుత్ ఉత్పత్తి, ఎరువుల పరిశ్రమలు, ఇతర కర్మాగారాలతో పాటు గృహ అవసరాలకు ఈ గ్యాస్ ఎంతో కీలకం కావడంతో, ప్రస్తుత ప్రమాదం వల్ల సరఫరాపై ఎలాంటి ప్రభావం పడుతుందోననే ఆందోళన వ్యక్తమవుతోంది.

## మాస్కోపై వందలాది డ్రోన్లతో ఉక్రెయిన్ భీకర దాడులు

**మొదటిపేజీ తరువాయి..** ప్రాంతాలే లక్ష్యంగా ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఉక్రెయిన్ వందలాది డ్రోన్లతో విరుచుకుపడింది. రష్యా వైమానిక రక్షణ దళాలు (ఎయిర్ డిఫెన్స్) స్పందించి మాస్కో వైపు దూసుకొచ్చిన సుమారు 60కి పైగా డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా అధికారులు వెల్లడించారు. ఈ భారీ డ్రోన్ దాడుల నేపథ్యంలో భద్రతా కారణాల దృష్ట్యా మాస్కో నగరంలోని నాలుగు ప్రధాన విమానాశ్రయాలను తాత్కాలికంగా మూసివేసి, విమాన సర్వీసులను నిలిపివేశారు. మాస్కోతో పాటు రష్యా ఆధీనంలోని క్రిమియా ద్వీపకల్పాన్ని కూడా ఉక్రెయిన్ భారీగా టార్గెట్ చేయడంతో అక్కడ అదనపు భద్రతా చర్యలు చేపట్టారు. ముందుజాగ్రత్త చర్యగా క్రిమియాలో సోమవారం జరగాల్సిన అన్ని రకాల బహిరంగ కార్యక్రమాలను అధికారులు రద్దు చేశారు. అలాగే తీవ్రమవుతున్న ఇంధన సంక్షోభం దృష్ట్యా సాధ్యమైనంత వరకు విద్యుత్ వినియోగాన్ని తగ్గించుకోవాలని స్థానిక ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

కీవ్ దళాలు వ్యూహాత్మకంగా రష్యా ఇంధన సముదాయాలు, కీలక చమురు శుద్ధి కేంద్రాలపై (ఆయిల్ రిఫైనరీలు) వరుస దాడులకు పాల్పడటంతో క్రిమియా ప్రాంతంలో ఇంధన సరఫరా వ్యవస్థ పూర్తిగా దెబ్బతింది. దీంతో నగరవ్యాప్తంగా ఉన్న పెట్రోల్ బంకుల్లో సాధారణ ప్రజలకు, ప్రభుత్వేతర సంస్థలకు ఇంధన విక్రయాలను తాత్కాలికంగా నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉక్రెయిన్ ఏమాత్రం విరామం ఇవ్వకుండా ప్రతిరోజూ వందలాది అత్యాధునిక డ్రోన్లతో విరుచుకుపడుతుండటంతో రష్యా యంత్రాంగం ఊపిరిసలపని స్థితిలో ఉక్కిరిబిక్కిరవుతోంది. ఈ క్రమంలోనే ఉక్రెయిన్ దాడులకు ప్రతీకారంగా రష్యా సైన్యం కూడా ప్రతిదాడులు ప్రారంభించింది. ఉక్రెయిన్‌లోని దక్షిణ ఒడెసా ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకుని రష్యా జరిపిన ఈ దాడుల్లో ఒకరు మరణించగా, ముగ్గురు తీవ్రంగా గాయపడినట్లు ఉక్రెయిన్ అధికారులు ప్రకటించారు. రష్యా క్షిపణి దాడుల ధాటికి ఒడెసాలో పలు వాహనాలు ధ్వంసం కాగా, అక్కడి ఇంధన నిల్వ ట్యాంకులలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఇరుదేశాల మధ్య సరిహద్దుల్లో యుద్ధం తీవ్రరూపం దాల్చడంతో అంతర్జాతీయంగా మళ్లీ ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి.

## ఆర్డీఎస్ నీటి వాటాపై రాజీపడే ప్రసక్తే లేదు: సాగునీటి శాఖ సమీక్షలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం

**హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్ర హక్కుల పరిరక్షణే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (=ఙూ) లో రాష్ట్రానికి కేటాయించిన సాగునీటి వాటా విషయంలో ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తే లేదని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నల్లమడ ఉత్తమ్ కుమార్ రెడ్డి తేల్చిచెప్పారు. ఆర్డీఎస్ ఆయకట్టు పరిధిలోని రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని ఆయన వెల్లడించారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో సోమవారం నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో మంత్రి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ పురోగతితో పాటు తుంగభద్ర డ్యామ్ పరిధిలోని జలాల వినియోగంపై సమగ్రంగా చర్చించారు.

తుంగభద్ర నదీ జలాల వినియోగంలో తెలంగాణకు ఉన్న చట్టబద్ధమైన హక్కులను అంతర రాష్ట్ర వేదికలపై అత్యంత బలంగా వినిపించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎగువ రాష్ట్రాలు తీసుకునే ఏకపక్ష నిర్ణయాలు లేదా చర్యల వల్ల తెలంగాణ ప్రాంత రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా అంతర్గత యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ముఖ్యంగా కృష్ణా పరీవాహక ప్రాంత రైతుల సాగునీటి అవసరాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. భవిష్యత్తులో జరగబోయే ట్రిబ్యునల్, బోర్డు సమావేశాలు, అలాగే అంతర్రాష్ట్ర చర్చల్లో తెలంగాణ వాదనను సాంకేతికంగా, చట్టపరంగా సమర్థవంతంగా వినిపించేందుకు వీలుగా సమగ్ర నివేదికను సిద్ధం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

తెలంగాణ వాటాకు రావాల్సిన ప్రతి చుక్క నీటిని పూర్తిస్థాయిలో వినియోగించుకుని, ఆయకట్టు చివరి భూములకు కూడా సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పునరుద్ఘాటించారు. రైతుల సాగునీటి అవసరాల పరిరక్షణలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదన్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించేలా పొరుగు రాష్ట్రాలు వ్యవహరిస్తే, ఏ వేదికపైనైనా సరే తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తూ రైతుల పక్షాన నిలబడి పోరాడుతుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# తెలంగాణలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి..

- **భారతీయ జనతా పార్టీ ఎస్ఐఆర్ జిల్లా కన్వీనర్, బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు కోరారు.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 22 (జన సంఘర్షణ)
భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ స్పెషల్ ఇంటెన్స్ రిజర్వేషన్ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్రంలో పకడ్బందీగా అమలు చేయడానికి ఈ నెల 25వ తేదీ నుండి గ్రామాలు, పట్టణాల్లో బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటరు నమోదు, సవరణ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ తరఫున ప్రతి బూత్‌లో బూత్ లెవల్ ఏజెంట్-2 (బి ఎల్ ఎ-2)లను నియమించడం జరిగింది. మెదక్ అసెంబ్లీ పరిధిలోని 274 బూత్‌లలో, నర్సాపూర్ అసెంబ్లీ పరిధిలోని 305 బూత్‌లలో బీఎల్ఏ-2లను పార్టీ నియమించింది. మెదక్ జిల్లాలోని ప్రతి గ్రామం, తండా, బూత్‌లో భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు ప్రజలకు సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే పార్టీ కార్యకర్తలు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తూ ఎస్ఐఆర్ కార్యక్రమం యొక్క ప్రాముఖ్యతను ప్రజలకు వివరిస్తున్నారు. ఒక్కరికి ఒకే ఓటు" అనే లక్ష్యంతో ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించేందుకు ఈ కార్యక్రమం చేపట్టబడుతోంది. ప్రజలు ఎటువంటి అపోహలకు లోనుకావద్దని విజ్ఞప్తి చేస్తున్నాం. ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా ఎవరి ఓటు హక్కును అన్యాయంగా తొలగించడం జరగదు. ఓటరు జాబితాలో ఉన్న తప్పులను సరిచేయడం, మరణించిన వారి పేర్లను తొలగించడం, ఒక వ్యక్తికి ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు నమోదు ఉంటే వాటిని నియమ నిబంధనల ప్రకారం సవరించడం మాత్రమే జరుగుతుంది. 2002 ఓటరు జాబితాలో పేరు ఉన్నవారు తమకు అందజేసిన ఫారాన్ని సక్రమంగా నింపి డిక్లరేషన్‌పై సంతకం చేసి బీఎల్ఓకు అందజేయాలి. ఒకవేళ 2002 ఓటరు జాబితాలో పేరు లేకపోయినా,తల్లిదండ్రుల వివరాలు, ఓటరు గుర్తింపు సంఖ్య వంటి ఆధారాలను సమర్పించడం ద్వారా అర్హులైన వారు తమ పేర్లను నమోదు చేసుకునే అవకాశం ఉంటుంది. ప్రతి ఇంటికి బీఎల్ఓలు రెండు ఫారాలు అందజేస్తారు. ఒక ఫారంపై బీఎల్ఓ సంతకం తీసుకుని ప్రజలు తమ వద్ద భద్రపరుచుకోవాలి. మరొక ఫారాన్ని పూర్తిగా నింపి, డిక్లరేషన్‌పై సంతకం చేసి బీఎల్ఓకు తిరిగి అందజేయాలి.ఇప్పటికే దేశవ్యాప్తంగా పలు సందర్భాల్లో ఓటరు జాబితా సవరణ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించబడ్డాయి. కాబట్టి ఈ కార్యక్రమంపై తప్పుడు ప్రచారాలను, అపోహలను ప్రజలు నమ్మవద్దు. ఎక్కడైనా సందేహాలు లేదా




ఇబ్బందులు ఎదురైతే ప్రతి బూత్‌లో అందుబాటులో ఉన్న భారతీయ జనతా పార్టీ కార్యకర్తలను సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చు. ఈ ఓటరు సవరణ కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరుతున్నాం. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే ఈ మహత్తర కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి.

# ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణను సద్వినియోగం చేసుకోవాలి

- **సందేహాలుంటే టోల్ ఫ్రీ 9553866388 కాల్ చేయాలి.**
- **జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతిమా సింగ్.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 22 (జన సంఘర్షణ)
జిల్లాలోని అర్హులైన పౌరులందరూ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని తమ పేర్లను సరిచూసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. సోమవారం ఐడీఓసి కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ..తప్పులు లేని ఓటర్ల జాబితా రూపకల్పనకు అన్ని వర్గాలు సహకరించాలని సూచించారు. జిల్లాలో ప్రత్యేక సవరణ కార్యక్రమం జూన్ 25 నుండి జూలై 24 వరకు జరుగుతుందని తెలిపారు. బూతు స్థాయి అధికారులు ప్రతి ఇంటిని కనీసం మూడు సార్లు సందర్శించి గృహ గణన పత్రాలను అందజేస్తారని చెప్పారు. ఓటర్లు ఆ పత్రాలను పూరించి తిరిగి సంబంధిత అధికారులకు అందజేయాలని సూచించారు. ఓటర్లు తమ వివరాలను ఇంటర్నెట్ ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చని, ఒకవేళ ఇంట్లో లేని పరిస్థితుల్లో ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.అక్టోబర్ 1, 2026 నాటికి 18 సంవత్సరాలు నిండే యువత





కొత్త ఓటర్లుగా నమోదు చేసుకోవాలని, ఇందుకు బూతు స్థాయి అధికారుల వద్ద లభించే దరఖాస్తు పత్రాలను వినియోగించాలని సూచించారు. జూలై 31, 2026న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేయబడుతుందని, అనంతరం ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, దరఖాస్తులు స్వీకరించబడతాయని తెలిపారు. వచ్చిన అభ్యంతరాలపై విచారణ జరిపి తుది ఓటర్ల జాబితాను అక్టోబర్ 1, 2026న ప్రకటించనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో గృహ గణన ప్రక్రియ 84 శాతం పూర్తయిందని తెలిపారు. చిరునామా మార్పులు ఉన్న ఓటర్లు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గృహ గణన పత్రాలు అందని వారు లేదా బూతు స్థాయి అధికారుల వివరాల కోసం రాష్ట్ర ఎన్నికల అధికారుల అధికారిక వెబ్సైట్లు సందర్శించవచ్చని, లేదా ఉచిత సహాయ సంఖ్య 1950 ను సంప్రదించవచ్చని తెలిపారు.

**ముఖ్య తేదీలు:**

-సవరణ కార్యక్రమం,జూన్ 25 నుండి జూలై 24, 2026 వరకు
- ముసాయిదా జాబితా విడుదల.జూలై 31, 2026
- అభ్యంతరాల స్వీకరణ: ఆగస్టు 30, 2026 వరకు
- తుది జాబితా ప్రకటన: అక్టోబర్ 1, 2026
- అర్హత: అక్టోబర్ 1, 2026 నాటికి 18 ఏళ్లు నిండేవారు

ఏమైనా సందేహాలుంటే హెల్ప్‌లైన్ 1950 కి కాల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డి పి ఆర్ ఓ రామచంద్ర రాజు, మీడియా ప్రతినిధులు, ఎలక్షన్ సూపరెండెంట్ తదితరులు పాల్గొన్నారు.

## సీసీటీఎన్ఎస్ 2.0 నమోదులో నిర్దేశిత టైమ్‌లైన్ పాటించాలి

- **అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 22 (జన సంఘర్షణ)



పోలీస్ స్టేషన్ల సిబ్బందికి ప్రత్యేక శిక్షణ.. సాంకేతిక అంశాలపై అవగాహన సీసీటీఎన్ఎస్ 2.0 వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేయాలంటే నిర్దేశిత టైమ్‌లైన్‌ను కచ్చితంగా పాటించడంతో పాటు డేటా నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఐపీఎస్ సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో సీసీటీఎన్ఎస్ 2.0 విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎఫ్ఐఆర్‌లు, కేసు డైరీలు, దర్యాప్తు పురోగతి, చార్జ్‌షీట్లు తదితర వివరాలను నిర్దేశిత గడువులోగా సీసీటీఎన్ఎస్ 2.0లో నమోదు చేయాలని ఆదేశించారు. డేటా ఎంట్రీలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా, పెండింగ్ లేకుండా సమాచారాన్ని ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు. అనంతరం సీసీటీఎన్ఎస్ 2.0 నిర్వహణలో సిబ్బందికి ఎదురవుతున్న సాంకేతిక, నిర్వహణపరమైన సమస్యలపై ఆరా తీసి, వాటి పరిష్కారానికి అవసరమైన సూచనలు చేశారు. అనంతరం నిర్వహించిన సాంకేతిక అవగాహన సమావేశంలో సీసీటీఎన్ఎస్ 2.0 అప్లికేషన్‌లో నూతనంగా అందుబాటులోకి వచ్చిన అప్‌డేట్లు, కొత్త ఫీచర్లు, వాటి వినియోగ విధానం, వాటి ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు.సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ, కొత్త ఫీచర్లను పూర్తిస్థాయిలో ఉపయోగించుకొని, నిర్ణీత టైమ్‌లైన్‌లో సమాచారాన్ని నమోదు చేస్తూ డేటా నాణ్యతను మరింత మెరుగుపరచాలని అదనపు ఎస్పీ సిబ్బందికి సూచించారు.

## రవీంద్ర భారతిలో వివేకానంద విద్యార్థుల యోగ ప్రదర్శన

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 22 (జన సంఘర్షణ)




అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని రవీంద్రభారతిలో రామాయంపేటకు చెందిన వివేకానంద విద్యాలయం విద్యార్థులు ప్రదర్శించిన యోగ విన్యాసాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కళలకు నిలయమైన ప్రతిష్టాత్మక రవీంద్రభారతిలో సిరాజ్ అకాడమీ సంస్థ ద్వారా ప్రతి ఏటా వివిధ కళలకు సంబంధించిన వ్యక్తులకు పురస్కారాలు అందించడం జరుగుతుంది.ఈ సంవత్సరం రామాయంపేటకు చెందిన విద్యార్థుల యోగ ప్రదర్శన ఎంపిక కావడంతో పాటు ఉత్తమ ప్రదర్శన కనబరిచిన యోగ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించడం జరిగింది. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని విజయవంతం చేసిన విద్యార్థులు, శిక్షకులు మద్దెల భరత్ ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ.రామ్ కుమార్ అభినందించారు. కార్యక్రమంలో రవీందర్, రాంప్రసాద్,శేఖర్ తదితర ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## వల్లభాపూర్ గ్రామం బూత్ అధ్యక్షుడు మేకల గంగాధర్ పెళ్లికి ఆర్థిక సాయం అందించిన ఎన్నారై శశాంక్

- **బాన్సువాడ నియోజకవర్గం బిజెపి నాయకులు ఎన్నారై కోనేరు శశాంక్ 5000 రూపాయలు ఆర్థిక సహాయం**

కోటగిరి/జూన్ 21/(జన సంఘర్షణ)



ఈరోజు కోటగిరి మండలం వల్లభాపూర్ గ్రామం బూత్ అధ్యక్షుడు మేకల గంగాధర్ పెళ్లికి బాన్సువాడ నియోజకవర్గం బిజెపి నాయకులు ఎన్నారై కోనేరు శశాంక్ 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఏములా నవీన్, హంసల అశోక్, కుటుంబ సభ్యులు పాల్గొనడం జరిగింది.

## కరెంట్ షాక్‌తో భార్యాభర్తలు మృతి

- **ఊట్‌పల్లి గ్రామంలో ఘటన**

బోధన్/జూన్22/(జన సంఘర్షణ)







నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం ఊట్పల్లిలో ఘోర విషాదం చోటుచేసుకుంది. ఇంటి ముందు బట్టలు ఆరబెట్టే ఇనుప వైర్కు కరెంట్ సరఫరా కావడంతో రత్నవత్ సంజీవ్ (38), రత్నవత్ జ్యోతి (32) దంపతులు విధ్యుత్ షాక్కు గురై అక్కడికక్కడే మృతి చెందారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.. రత్నావత్ సంజీవ్ కు ఇద్దరు భార్యలు.. నలుగురు సంతానం.. వ్యవసాయం చేసే సంజీవ్, జ్యోతి దంపతులు ఆదివారం రాత్రి పొలం పనులు ముగించుకుని ఇంటికి వచ్చారు. వ్యవసాయ పనుల కారణంగా తడిసిన బట్టలు జ్యోతి ఇనుపు వైర్ పై ఆరబెట్టేందుకు యత్నించగా విద్యుత్ శాఖ్ కు గురైంది. అమెను కాపాడేందుకు వెళ్లిన సంజీవ్ కూడా కరెంట్ షాక్ కు గురయ్యాడు. అక్కడికి వచ్చిన సంజీవ్ చిన్న భార్య వారిద్దరిని కాపాడేందుకు కర్రతో ప్రయత్నించగా ఆమె కూడా గాయపడింది. సంజీవ్, జ్యోతి దంపతులకు ముగ్గురు కూతుళ్లు కాగా వారిద్దరు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కేసు నమోదు చేసిన బోధన్ రూరల్ ఎస్సై రాజశేఖర్ దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బోధన్ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

## అర్చరీలో ఋతుజ ప్రతిభ

పొతంగల్/జూన్ 22/(జన సంఘర్షణ)






పొతంగల్ మండలం సుంకిని గ్రామానికి చెందిన కలెనోర్ ఋతుజ అర్చరీ, యోగాలో ప్రతిభ కనబరుస్తోంది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఇంటి వద్ద సాధన చేస్తూ ముందుకు సాగుతోంది. సరైన శిక్షణ, ప్రభుత్వ ప్రోత్సాహం అందితే రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలు ఉన్నాయని తండ్రి కలెనోర్ మాధవరావు కోరారు. ఆమె ప్రతిభను గుర్తించి సంబంధిత అధికారులు, క్రీడా సంస్థలు సహకరించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

## 'ఇసుక అక్రమ రవాణా చేస్తున్న 3 ఆటోలు పట్టివేత'

బోధన్/సాలూరు మండలం/జూన్ 22 (జన సంఘర్షణ)




సాలూర మండలం మంజీరా నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ఆటోలను రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. బోధన్ మండలం నాగన్పల్లి వద్ద ఇసుక అక్రమ రవాణా చేస్తున్న 3 ఆటోలను తహశీల్దార్ విట్టల్ పట్టుకున్నారు. వాటిని తహశీల్దార్ కార్యాలయానికి తరలించారు. ఇసుక అక్రమ రవాణా చేస్తూ పట్టుబడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

## గ్రామీణ విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం ఒక వరం

కోటగిరి/జూన్ 22/(జన సంఘర్షణ)



గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు పాఠశాలకు సురక్షితంగా సకాలంలో చేరుకునే రవాణా సౌకర్యం కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఉచిత పాఠశాల బస్సు ఒక వరం అని ఎత్తోండ గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధిరాలు అలివేలు అన్నారు. సోమవారం కోటగిరి మండల పరిధిలోని ఎత్తొండ గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు ఎత్తోండ గ్రామ సర్పంచ్ శ్వేత సూర్యకాంత్ బోధన్ డిపో మేనేజర్ తో మాట్లాడి వయ వల్బాపూర్ దోమల్ యాద్గర్పూర్ ఎత్తొండ బస్సు సౌకర్యం కల్పించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు సూర్యకాంత్ మాట్లాడుతూ ..తాను చేసింది సేవ కాదని, బాధ్యత కర్తవ్యం అని అన్నారు. తాను చదువుకునే రోజుల్లో ఇంటీ అన్ని పనులు చేసి పాఠశాలకు ఆలస్యంగా వచ్చేవాడిని, అలాంటిది పక్క ఊర్ల నుంచి విద్యార్థులు నడుచుకుంటూ రావడం సాహసమే అన్నారు. పుట్టిన ఊరికి, చదువుకున్న పాఠశాలకు ఏదో ఒకటి చేయడం ధర్మం అని తెలిపారు. ప్రతిరోజూ విద్యార్థులు నడుచుకుంటూ పక్క గ్రామం నుంచి పాఠశాలకు వెళ్తుండటం చూసి తనకు ఎంతో బాధ కలిగిందని, ఆ కష్టాన్ని తొలగించాలనే సంకల్పంతో బోధన్ డిపో మేనేజర్ తో మాట్లాడి బస్సు సౌకర్యం కల్పించారు బస్సు విషయం లో బోధన్ డిపో మేనేజర్ ఎంతో సహకరించారు వారికి ధన్యవాదాలు తెలిపిన ఎత్తొండ గ్రామ సర్పంచ్ శ్వేత సూర్యకాంత్, గ్రామ ప్రజలు ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

జన సంఘర్షణ
మంగళవారం
23 జూన్ 2026

# జిల్లాలో యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయి

- రైతులు ఆందోళన చెందవద్దు
- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి / జూన్ 22/(జన సంఘర్షణ)



జిల్లాలో రైతులకు యూరియా ఎరువుల కొరత లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందని, అవసరమైన మేరకు యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎరువుల సరఫరాను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక మొబైల్ యాప్‌ను అమలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ యాప్ ద్వారా రైతులు సాగు చేస్తున్న పంటల విస్తీర్ణానికి అనుగుణంగా యూరియా పంపిణీ జరుగుతోందన్నారు. దీనివల్ల ఎరువుల సమాన పంపిణీతో పాటు అక్రమ నిల్వలు, మళ్లింపులను అరికట్టడం సాధ్యమవుతోందని పేర్కొన్నారు. గత వానాకాలంతో పోలిస్తే ప్రస్తుతం వరి నాట్లు నమోదైన విస్తీర్ణం తక్కువగా ఉన్నప్పటికీ రైతులు ముందస్తుగా యూరియాను కొనుగోలు చేస్తున్నారని కలెక్టర్ తెలిపారు. కామారెడ్డి జిల్లాలో గత ఏడాది ఇదే సమయానికి 5,571 ఎకరాల్లో వరి నాట్లు నమోదుకాగా, ఈ ఏడాది ఇప్పటివరకు 250 ఎకరాల్లో మాత్రమే నాట్లు నమోదయ్యాయని పేర్కొన్నారు. అయినప్పటికీ గత ఏడాది ఇదే తేదీ నాటికి 2.37 లక్షల యూరియా బస్తాలు కొనుగోలు చేయగా, ఈ ఏడాది 2.64 లక్షల బస్తాలను రైతులు కొనుగోలు చేశారని వివరించారు. జిల్లాలో ప్రస్తుతం 0.65 లక్షల యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నాయని, అదనంగా అవసరమైన మేరకు నిల్వలను నిరంతరం సమకూరుస్తున్నామని తెలిపారు. అలాగే జిల్లాలో 1.25 లక్షల ఎకరాల్లో వరి నర్సరీలు పెంచబడిన నేపథ్యంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని, రాష్ట్రవ్యాప్తంగా 85 లక్షల బస్తాలకు పైగా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, రైతులు యాప్ ద్వారా బుకింగ్ చేసుకుని ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులను పొందవచ్చని కలెక్టర్ తెలిపారు. రైతుల అవసరాలను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ తగిన నిల్వలను అందుబాటులో ఉంచుతోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతులు యూరియా లభ్యతపై ఎలాంటి అపోహలు, ఆందోళనలకు గురికాకుండా అవసరమైన మేరకు మాత్రమే ఎరువులను కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సూచించారు.

# భారత వాయు సేన ఆధ్వర్యంలో నిర్మించనున్న ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను అన్ని వసతులతో అభివృద్ధి చేయాలి

- రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు..

ఢిల్లీ/జూన్ 22/(జన సంఘర్షణ)

భారత వాయు సేన (ఐఎఎఫ్) ఆధ్వర్యంలో నిర్మించనున్న ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను అన్ని వసతులతో అభివృద్ధి చేయాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి ఢిల్లీలోని రక్షణ శాఖ కార్యాలయం కర్తవ్య భవన్‌లో రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ భూములు బదలాయించినందుకు రాజ్‌నాథ్ సింగ్‌కి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ అత్యంత ప్రాధాన్య ప్రాజెక్టుల్లో ఒకటైన ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి సంబంధించి భూ సేకరణ, యుటిలిటీస్ బదలాయింపు అంశాల్లో పూర్తిగా సహకరిస్తామని కేంద్ర మంత్రికి తెలియజేశారు. ఆదిలాబాద్‌లో భారతీయ వాయు సేన ఆధ్వర్యంలో రానున్న విమానాశ్రయం దేశ సమగ్రత, రక్షణకు సంబంధించిన అంశమైనందున, దానిని భారీగా విస్తరిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని విధాలా సహకరిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. భారత వాయు సేన టెర్మినల్‌తోపాటు ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించనున్న పౌర విమానయాన శాఖకు చెందిన టెర్మినల్ బిల్డింగ్‌తో పాటుగా కార్గో, ఎంఆర్‌వో, హ్యాంగర్ సదుపాయాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసేందుకు సహకరించాలని ఈ సందర్భంగా కేంద్ర మంత్రిని కోరారు. ఇటీవల మధ్య ఆసియాలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఎయిర్‌లైన్స్ తమ హ్యాంగర్స్‌ను ఏర్పాటు చేసుకోవడానికి సరైన ప్రదేశాలను అన్వేషిస్తున్నాయని, హ్యాంగర్ ఏర్పాటుకు ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అత్యంత అనుకూలమైనందున, ఆ దిశగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. తమ కీలకమైన




ప్రాజెక్టు ఏర్పాటుకు డీఆర్‌డీవో / డీఆర్‌డీఎల్ మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర సమీప ప్రదేశాన్ని ఎంపిక చేసుకున్నందున ఆ ప్రాజెక్ట్‌ను త్వరగా మంజూరు చేయాలని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రిని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కష్టాల్లో ఉన్నవారికి నేనున్నానంటూ భరోసా..

- సేవా కార్యక్రమాల్లో సర్పంచ్ మంగీలాల్ ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలిచిన కొత్త తండా సర్పంచ్

చిన్నకట్టుగూడెం, జూన్ 22:



ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామ్యం అవుతూ, ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్న కొత్త తండా సర్పంచ్ మంగీలాల్ మరోసారి తన సామాజిక బాధ్యతను చాటుకున్నారు. చిన్నకట్టుగూడెం గ్రామంలో ఇటీవల మరణించిన కుటుంబ సభ్యుల దిశా కర్మల కార్యక్రమాల్లో పాల్గొని బాధిత కుటుంబాలకు పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో మాట్లాడిన సర్పంచ్ మంగీలాల్, వారి బాధను పంచుకుంటూ ధైర్యం చెప్పారు. "ఎలాంటి కష్టం వచ్చినా నేను మీకు అండగా ఉంటాను. ప్రజలకు అవసరమైన సమయంలో అందుబాటులో ఉండటమే ప్రజాప్రతినిధిగా నా బాధ్యత" అని పేర్కొన్నారు. ఆయన మాటలతో కుటుంబ సభ్యులు కొంత మనోధైర్యం పొందారు. అనంతరం గ్రామానికి చెందిన బానోత్ భద్రి దిశా కర్మల సందర్భంగా బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని అందజేసి తన మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. ఆపద సమయంలో ఆర్థికంగా, మానసికంగా తోడ్పాటు అందించడం ద్వారా ప్రజల మన్ననలు పొందుతున్నారు. ఈ కార్యక్రమంలో దిశా కమిటీ మాజీ సభ్యుడు లకావత్ లక్ష్మణ్, కొత్త తండా ఉపసర్పంచ్ రవి, గుంపలగూడెం గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ శంకర్, బాబురావు, వెంకటేష్, నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు మాట్లాడుతూ.. ప్రజల కష్టాలను తమ కష్టాలుగా భావించి ముందుకు వచ్చి సహాయం చేస్తున్న సర్పంచ్ మంగీలాల్ సేవాభావం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తోందని కొనియాడారు.

# అభివృద్ధి పనుల పేరిట అక్రమంగా మొరం తవ్వకాలు...

- యథేచ్ఛగా అక్రమ దందా అక్రమార్కులకు వరమైన మొరం తవ్వకాలు చోద్యం చూస్తున్న అధికారులు

రుద్రూర్,/జూన్ 22/(జన సంఘర్షణ)





పచ్చనదంతో కళకళలాడాల్సిన గుట్టలు కొందరు అక్రమార్కుల తాకిడికి కనుమరుగవుతున్నాయి. రుద్రూర్ మండల కేంద్రంలోని రాయకూర్ గ్రామ శివారులోని గుట్ట ప్రాంతంలో ఎలాంటి అనుమతులు లేకుండానే యథేచ్ఛగా మొరం తవ్వకాలు చేపడుతూ అటవీ సంపదను కొల్లగొడుతున్నారు. జేసీబీల సహాయంతో మొరం త్రవ్వకాలు చేపడుతూ ట్రాక్టర్లలలో అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసు కుంటున్నారు. అక్రమ దందాను అడ్డుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. ప్రభుత్వ భూముల నుంచి కాని అటవీ ప్రాంతాల నుంచి కాని, చెరువుల నుంచి మొరం తీయాలంటే తప్పనిసరిగా అధికారుల అనుమతి తీసుకోవాలి కాని ఇక్కడ అవేమి లేవు. అభివృద్ధి పనుల పేరిట అక్రమంగా మొరం తవ్వుతూ గుట్టల ఆనవాళ్లు లేకుండా చేస్తున్నారు. అక్రమంగా మొరం తవ్వకాలు జరుగుతున్నాయని తెలిసినా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమంగా మొరం తవ్వకాలు చేపడుతున్న వారిపై తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డి

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 22 (జన సంఘర్షణ)



మెదక్ జిల్లా పాపన్నపేట మండలానికి చెందిన ఇద్దరు బీఆర్ఎస్ నాయకుల కుటుంబాల్లో జరిగిన వివాహ వేడుకల్లో మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. మండలంలోని ఎంకేపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు విట్టల్ కుమారుడు యాదగిరి వివాహం నాగరాణి తో కొత్తపల్లిలోని అనంత పద్మనాభ స్వామి ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. అలాగే పొడిచన్పల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ఏసు సోదరుడు గణేష్ వివాహం శ్రావణితో ఎస్ఆర్ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డి వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాపన్నపేట్ మండల పార్టీ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కొత్తపల్లి.జగన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రెడ్డి, చిత్రియాల్ సర్పంచ్ సురేష్, మాజీ సర్పంచులు గురుమూర్తి గౌడ్,బద్రి. మల్లేశం, లింగారెడ్డి, నాయకులు వెంకటేశం, శ్రీనివాస్, కృష్ణ, విట్టల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా విచారించి బాధితులకు న్యాయం చేయాలి

- వినతులు స్వీకరించి సంబంధిత అధికారులకు ఆదేశాలు.
- ప్రజావాణిలో ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి జిల్లా ఎస్పీ డి.వి.శ్రీనివాస్ రావు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 22 (జన సంఘర్షణ)



మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు ప్రజల నుండి వచ్చిన వినతులు, ఫిర్యాదులను స్వీకరించి వాటిపై సమగ్రంగా విచారణ జరిపారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక,భూ వివాదాలు, మోసాలు, వేధింపులు ఇతర సమస్యలకు సంబంధించిన అర్జీలను సమర్పించారు. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్పీ, బాధితులకు న్యాయం జరిగే విధంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణి ద్వారా అందిన ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం లేకుండా వ్యవహరించాలని, ప్రతి వినతిదారునికి ఫిర్యాదు పురోగతిపై సమాచారం అందించాలని పోలీసు అధికారులకు సూచించారు. ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించడం ద్వారా పోలీసు వ్యవస్థపై విశ్వాసం మరింత పెంపొందించాలన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడం, బాధితులకు త్వరితగతిన న్యాయం చేయడం, ప్రజా సమస్యల పరిష్కారానికి పారదర్శకమైన వ్యవస్థను అమలు చేయడం మెదక్ జిల్లా పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని సూచించారు.

# పాఠశాల నిధుల మాయంపై ఆర్డీవోకు ఫిర్యాదు

- పాఠశాల నిధుల మాయంపై ఆర్డీవోకు ఫిర్యాదు.

బోధన్ ప్రతినిధి /జూన్ 22/(జన సంఘర్షణ)



బోధన్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాఠశాల నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపిస్తూ ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని బోధన్ జేఏసీ విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు సోమవారం స్థానిక ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించాయి. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ నాగరాజు, కో-కన్వీనర్ తల్లరే సంజయ్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధిక సంఖ్యలో విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. పాఠశాల నిర్వహణ, మౌలిక వసతుల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి సంవత్సరం రూ.12 లక్షల నుంచి రూ.18 లక్షల వరకు నిధులు కేటాయిస్తున్నాయని పేర్కొన్నారు. అయితే ఆ నిధులను విద్యార్థుల సంక్షేమం, పాఠశాల అభివృద్ధి కోసం వినియోగించాల్సిన ప్రధానోపాధ్యాయుడు వాటిని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. గత నాలుగు సంవత్సరాల అడ్మిషన్లు, విద్యార్థుల రికార్డులు గల్లంతయ్యాయని చెబుతూ బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రశ్నించినప్పుడు నకిలీ ఆధారాలు, ఫేక్ బిల్లులు చూపిస్తూ తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. పెయింటింగ్ తదితర పనుల పేరుతో తప్పుడు ఖర్చులు చూపిస్తున్నారని పేర్కొన్నారు. పాఠశాలలో ఇప్పటికీ మరుగుదొడ్లు, తాగునీటి వంటి కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరిపి, దుర్వినియోగమైన మొత్తాన్ని తిరిగి పాఠశాల ఖాతాలో జమ చేయించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పాఠశాల అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఎన్. బాలరాజ్.. కిరణ్, ప్రశాంత్, రాజన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

## డిటిఓ వెంకన్న మృతిపై విచారణ జరపాలి

◆ **మాజీ మంత్రి బారాస సీనియర్ నాయకులు హరీష్ రావు డిమాండ్**





భూపాలపల్లి/జూన్ 22/(జన సంఘర్షణ)
భూపాలపల్లి జిల్లాలో డిటిఓ వెంకన్నను బొగ్గు లారీ వేగంతో ఢీకొనడంతో వెంకన్న అక్కడికక్కడే మృతి చెందారు. ఈ విషయంలో పలు అనుమానాలు వ్యక్తమవుతుందని మాజీ మంత్రి బారస సీనియర్ నాయకులు హరీష్ రావు డిమాండ్ చేస్తున్నారు. ఇసుక మాఫియా, మొరం మాఫియా, బొగ్గు మాఫియా, మట్టి మాఫియా పై అనుమానాలు వ్యక్తమవుతుందని హరీష్ రావు అనుమానాలను వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో ఎవరెవరు ఏ దంద ఎవరు చేస్తున్నారు పూర్తిగా విచారణ జరిపి వెంకన్న మృతికి కారకుడు ఎవరో తేల్చాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ విధులు కూడా నిర్వహించకుండా మాఫియా చెల్లరేగిపోతుందని హరీష్ రావు ఆరోపించారు. తక్షణం వెంకన్న మృతిపై పూర్తిగా విచారణ జరిపి అసలైన దోషులను పట్టుకుని వారికి శిక్షించాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. వెంకన్న కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉండాలని, ఆయన కుటుంబానికి కోటి రూపాయల పర్యారం అందించి, వారి ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

## నాకు న్యాయం చేయండి

◆ **ఆర్డీవో కార్యాలయంలో ప్రజావాణిలో ఫిర్యాదు..**



బోధన్/జూన్ 22/(జన సంఘర్షణ)
నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని ఉజ్మీర్ గల్లీలో నివాసం ఉండే తనకు రావాల్సిన వాటా విషయంలో తనకు అన్యాయం జరుగుతుందని ఈ విషయంలో బోధన్ పోలీస్ స్టేషన్కు వెళ్తే సీఐ వెంకట్ నారాయణ తనకు న్యాయం చేయాల్సి ఉండగా తనకు బెదిరింపులు చేస్తున్నారని అన్యాయం చేస్తున్నారని బోధన్ ఆర్డీవో కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా బాధితురాలు ఆర్డీవోకు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వినతిపత్రం ఇవ్వడం జరిగింది.

## 30 కిలోల అడవి జంతువుల మాంసం పట్టివేత..

◆ **ఫారెస్ట్ అధికారుల చర్యలు**



మహబూబాబాద్/జూన్ 22/(జన సంఘర్షణ)
మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కేంద్రంలోని కాకతీయనగర్‌లో అడవి జంతువుల మాంసం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో అటవీశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. అయితే అధికారుల రాకను గమనించిన కొందరు స్మగ్లర్లు అక్కడి నుంచి పరారయ్యారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కేంద్రంలోని కాకతీయనగర్‌లో అడవి జంతువుల మాంసం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో అటవీశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. అయితే అధికారుల రాకను గమనించిన కొందరు స్మగ్లర్లు అక్కడి నుంచి పరారయ్యారు. అధికారుల తనిఖీ సమయంలో మాంసం విక్రయిస్తున్న ఒక వ్యక్తిని అటవీశాఖ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌తో వేటగాళ్లు వాగ్వాదానికి దిగారు. పరిస్థితిని అదుపులోకి తీసుకున్న అధికారులు విచారణ చేపట్టారు. అధికారుల తనిఖీల్లో సుమారు 30 కిలోల అడవి జంతువుల మాంసంతో పాటు ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై సంబంధిత అటవీ చట్టాల కింద అధికారులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అడవి జంతువుల వేట, మాంసం విక్రయం, రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వన్యప్రాణుల సంరక్షణకు భంగం కలిగించే చర్యలను అరికట్టేందుకు ప్రజలు కూడా సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే సమాచారం అందించాలని అటవీశాఖ అధికారులు సూచించారు.

## సాలురా మండలంలో రాత్రివేళల ఇసుక అక్రమ రవాణా జోరు

బోధన్/సాలురా మండల/జూన్ 22/(జన సంఘర్షణ)



సాలురా మండల పరిధిలోని హుంస, మంధర్నా, తగ్గేల్లి ప్రాంతాలతో పాటు మంజీరా పరివాహక ప్రాంతాల నుంచి ప్రతి రోజు రాత్రి 1 గంట నుంచి ఉదయం 5 గంటల వరకు భారీ ఎత్తున ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇసుకను బోలెరో వాహనాలు, ఆటోల ద్వారా నిజామాబాద్ కేంద్రానికి తరలిస్తున్నట్లు సమాచారం. అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన రాత్రి గస్తీ రెవెన్యూ సిబ్బందిని కొందరు నిర్వాహకులు ప్రభావితం చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. అదే మార్గంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులను కూడా మేనేజ్ చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇసుక రవాణా చేస్తున్న వాహనాలకు కాపలా బృందాలు తిరుగుతూ, స్థానికంగా విధులు నిర్వహిస్తున్న అధికారుల కదలికలపై సమాచారం సేకరించి బోలెరో డ్రైవర్లకు చేరవేస్తున్నట్లు తెలుస్తోంది. ఏ అధికారి ఎక్కడ ఉన్నారనే సమాచారాన్ని ముందుగానే అందించి వాహనాలను అప్రమత్తం చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి విచారణ జరిపి, అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డ రైతు

◆ **యూరియా ఎరువుల కోసం ఆందళనకు దిగిన రైతులు**



రాజంపేట/, జూన్ 22/(జన సంఘర్షణ)
యూరియా లేక, పంటలకి ఎరువుగా ఏం వేయాలో తెలియక మనస్తాపానికి గురైన ఒక రైతు తన ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే అక్కడే ఉన్న అధికారులు, పోలీసులు, ఇతర రైతులు అప్రమత్తమవడంతో ఆ రైతు ప్రాణాలతో బయట పడ్డాడు. రాజంపేట మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణలో యూరియా ఎరువుల కోసం రైతులు సోమవారం ఆందోళనకు దిగారు. వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్న సమయంలో యూరియా అందుబాటులో లేకపోవడంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చిన యూరియాను కూడా పంపిణీ చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. యాప్ లో కాకుండా నేరుగా తమకు యూరియా అందించాలని ఒక్కసారిగా సొసైటీ ఆవరణంలోకి దూసుకొచ్చారు. తమకు పెద్ద 5జీ ఫోన్లు లేవని తాము యూరియా ఎట్లా బుక్ చేసుకోవాలని రైతులు వాపోయారు. యూరియా కొరత కారణంగా పంటలకు ఏమి మసాలాలు వేయాలని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తగినంత యూరియాను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న వ్యవసాయడిమాండ్ చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న వ్యవసాయ శాఖ అధికారులు డివిజనల్ వ్యవసాయ అధికారి అపర్ణ మండల వ్యవసాయ అధికారి జ్యోత్స్న ప్రియదర్శిని, సీఈఓ వెంకటేశ్వర శర్మ రైతులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చి రైతులను శాంతింప చేశారు.

# ఆదివాసీ యువకులు తుడుందెబ్బలో చేరిక

◆ **వాసం ముసలయ్య ఆధ్వర్యం**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, జూన్ 22(జనసంఘర్షణ):
సుబ్బంపెట, ఎదురు గుట్టలు లో సభ ముగిసిన తర్వాత వాసం ముసలయ్య ఆధ్వర్యంలో డాక్టర్ మైపతి అరుణ్ కుమార్ నాయకత్వం పై పూర్తి నమ్మకంతో భవిష్యత్ ఉద్యమలు కొనసాగాలంటే యువత పాత్ర ముఖ్యమని తుడుందెబ్బలో చర్ల యువకులు చేరడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మైపతి అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. ఈ సభ విజయవంతం చేసిన ఆదివాసీ జాతి ప్రజలకు ప్రత్యేక ధన్యవాదములు అని అన్నారు. భవిష్యత్తు ఉద్యమం నడవాలంటే మీలాంటి యువకులు తుడుందెబ్బ రధ సారదులు కావాలని అల కావాలంటే ఉద్యమం దగ్గరుండి నడిపించాలని అదేవిధంగా మన హక్కులు,చట్టలు అలాగే లంబాడిలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలంటే యువకులు ముఖ్యమని, భవిష్యత్తు కార్యాచరణ వివరిస్తూ ప్రతి ఊర్లో, ప్రతి గూడెం లో తుడుందెబ్బ విస్తరించాలని ప్రతి ఇంట్లో నుంచి ఉద్యమ కార్యకర్తలు రావాలని పిలునిచ్చారు. ఈ సమావేశం అనంతరం తుడుందెబ్బ సీనియర్ నాయకులు వాసం ముసలయ్యని తుడుందెబ్బ రాష్ట్ర పోలీట్ బ్యూరో సభ్యులుగా నియమించంచారు. ఆదివాసీ యువ నాయకులు పూనెం వరప్రసాద్ ని తుడుందెబ్బ భద్రాద్రి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులు అయ్యారు. ఈ కార్యక్రమంలో చర్ల, నూగురు మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్ప శ్రీనివాసరావు, ఆదివాసీ సీనియర్ నాయకులు కుర్సం రాంబాబు, తుడుందెబ్బ భద్రాద్రి జిల్లా అధ్యక్షులు ధరబోయిన రమేష్, తుడుందెబ్బ మహిళా రాష్ట్ర నాయకురాలు వట్టం సుభద్ర, తుడుందెబ్బ సీనియర్ నాయకులు తాటి రామకృష్ణ, చర్ల మండల తుడుందెబ్బ యువ నాయకులు శ్యామల తరుణ్, పూనెం రవికిరణ్, కలం శ్రీనివాస్, కోరం బిక్షపతి,ఇర్ప అరుణ్ కుమార్, ఇర్ప అరుణ్ తేజ్, ఇర్ప సాయికిరణ్, కోరం వేణు,మడప అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళ ప్రయాణికురాలి మెడలోని బంగారు గుండ్లు మాయం

◆ **బస్సును నిలిపి తనిఖీలు చేపట్టిన పోలీసులు**

నందిపేట్, /జూన్ 22/(జన సంఘర్షణ)



బస్సులో ప్రయాణిస్తున్న మహిళ ప్రయాణికురాలు మెడలో నుంచి బంగారు గుండ్లు మాయం అయ్యాయి. విషయాన్ని గమనించిన మహిళ తన బంగారం గుండ్లు పోయాయని లబోదిబోమంది. వెంటనే బస్సు డ్రైవర్ బస్సును నందిపేట్ పోలీస్ స్టేషన్ తరలించి తనిఖీలు చేపట్టారు. ఈ సంఘటన సోమవారం సాయంత్రం నందిపేట్ మండల కేంద్రంలో జరిగింది. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి బంగారు గుండ్లను వెతికే పనిలో పడ్డారు. అందులో ఉన్న ప్రయాణికులందరినీ కిందకు దించి గాలించారు.

## పెరుగు ప్యాకెట్లో చనిపోయిన ఎలుక..

◆ **ల్యాబ్కు శాంపిల్స్**

వరంగల్/జూన్ 22/(జన సంఘర్షణ)



వరంగల్ ఎస్ఆర్ఆర్ తోట సమీపంలోని ఓ కిరాణా దుకాణంలో ఈ నెల 20న కొనుగోలు చేసిన 'సంగం డెయిరీ' పెరుగు ప్యాకెట్లో చనిపోయిన ఎలుక రావడం కలకలం సృష్టించింది. ఇంటికి వెళ్లి ప్యాకెట్ కట్ చేయగా అందులో ఎలుక పిల్ల వచ్చిందని కస్టమర్ తెలిపారు. ఆ బ్యాచ్కు చెందిన ప్యాకెట్ల అమ్మకాలను నిలిపేశామని, శాంపిల్స్ను ల్యాబ్కు పంపామని ఫుడ్ సేఫ్టీ అధికారులు తెలిపారు. నివేదిక ఆధారంగా కంపెనీపై చర్యలు తీసుకుంటామన్నారు.

# జర్నలిస్ట్ పై దాడి అమానుషం

◆ **నిందితులను వెంటనే అరెస్టు చేయాలని టియూడబ్ల్యూజే - ఐజేయు జిల్లా అధ్యక్షుడు శంకర్ దయాల్ చారి డిమాండ్.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 22 (జన సంఘర్షణ)
ప్రభుత్వ స్థలంలో అక్రమంగా ఏర్పాటు చేసిన షాపులకు గ్రామ పంచాయతీ నోటీసులు జారీ చేసిన వార్త రాసినందున మన తెలంగాణ నార్సింగి విలేకరి



రాఘవేంద్ర పై సోమవారం నాడు జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు టియుడబ్ల్యుజే ఐజేయు జిల్లా అధ్యక్షుడు శంకర్ చారి పేర్కొన్నారు. ఈ విషయమై సోమవారం నార్సింగి పోలీస్ స్టేషన్ లో యూనియన్ నాయకులతో కలిసి పిర్యాదు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పత్రికా స్వేచ్ఛను హరిస్తూ నిజాలు నిగ్గు తేల్చిన జర్నలిస్టులపై దాడులు హేయనీయమని అన్నారు. దాడికి పాల్పడిన వ్యక్తులపై పోలీసులు వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో మంగళవారం నాడు జిల్లా వ్యాప్తంగా ప్రతి మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్, తహాసిల్దార్ కార్యాలయాల్లో యూనియన్ తరపున ఫిర్యాదులు చేయాలని పిలుపునిచ్చారు. పోలీసులు కాలయాపన చేసి నిందితులను అరెస్టు చేయడంలో




జాప్యం చేస్తే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని తెలిపారు. ఈ అయన వెంట రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డిజి శ్రీనివాస్ శర్మ, ఐజేయూ సభ్యులు కే. శ్రీనివాస్ మిన్పూర్, రామాయంపేట జర్నలిస్ట్ లు సత్యనారాయణ, మల్లేశం, జిల్లా నాయకులు రమేష్ గౌడ్, బైరవరెడ్డి, యాదగిరి, మన తెలంగాణ జిల్లా ప్రతినిధి ఎస్. నర్సింహా చారి,అరుణ్, అనిల్,సలీం, రాచర్ల నరేందర్ తదితరులు ఉన్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం తెలుగు దినపత్రిక
మంగళవారం
23 జూన్ 2026

# జూదం, బెట్టింగ్ స్థావరాలపై పోలీసుల దాడులు

- బిబిచ్కుంద, ఎల్లారెడ్డి పరిధిలో 13 మంది అరెస్ట్
- రూ.16,430 నగదు, 10 మొబైళ్లు, 13 బైకులు స్వాధీనం
- అక్రమ కార్యకలాపాలపై ఉక్కుపాదం: జిల్లా ఎస్పీ హెచ్చరిక
- బిడయల్-100కు సమాచారం ఇవ్వాలని పోలీసుల విజ్ఞప్తి

బిబిచ్కుంద, ఎల్లారెడ్డి/జూన్ 22/(జన సంఘర్షణ)

జూదం, బెట్టింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలపై కామారెడ్డి జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఆదివారం బిచ్కుంద, ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రత్యేక దాడులు నిర్వహించి 13 మందిని అదుపులోకి తీసుకున్నారు.

**బిచ్కుందలో పేకాట స్థావరంపై దాడి..**

విశ్వసనీయ సమాచారంతో బిచ్కుంద పోలీస్ స్టేషన్ పరిధిలోని కందర్పల్లి గ్రామ శివారులో ఎస్ఐ జి. రాజు ఆధ్వర్యంలో దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకోగా, ముగ్గురు పరారయ్యారు. వారి వద్ద నుంచి రూ.5,230 నగదు, మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.



**ఎల్లారెడ్డిలో హెడ్ అండ్ టెయిల్ జూదం**

ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని తిమ్మాపూర్ గ్రామ అటవీ ప్రాంతంలో హెడ్ అండ్ టెయిల్ జూదం ఆడుతున్న స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఏడుగురిని అదుపులోకి తీసుకోగా, ఆరుగురు పరారయ్యారు. వారి వద్ద నుంచి రూ.11,200 నగదు, 13 ద్విచక్ర వాహనాలు, 7 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

**ఎస్పీ హెచ్చరిక...**

జూదం, బెట్టింగ్ వంటి అక్రమ కార్యకలాపాలు వ్యక్తులు, కుటుంబాలు,







సమాజంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతాయని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొనడం వల్ల ఆర్థిక నష్టాలతో పాటు సామాజిక సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. జిల్లాలో అక్రమ జూదం, పేకాట, బెట్టింగ్ స్థావరాలపై నిరంతర నిఘా కొనసాగుతోందని, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడైనా జూదం, పేకాట, బెట్టింగ్ లేదా ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్కు లేదా డయల్-100కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ తెలిపారు.

**డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు...**

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీలలో మొత్తం 37 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని న్యాయస్థానంలో హాజరుపరచగా మొత్తం రూ.52,700 జరిమానా విధించబడింది. అదేవిధంగా 14 మందికి ఒక రోజు జైలు శిక్ష, 2 మందికి రెండు రోజుల జైలు శిక్ష విధించబడింది. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు సంభవించి ప్రాణనష్టం జరిగే అవకాశం ఉన్నందున ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని జిల్లా పోలీసులు సూచించారు.

# యోగాపథం - ప్రశాంత గమ్యం



తూర్పు కొండల వెనుక సూర్యుడు మేల్కొంటుండగా
ప్రకృతి మౌనంగా ఒక రాగాన్ని ఆలపిస్తోంది,
ఆ రాగమే శ్వాస... ఆ శ్వాస ఏ జీవన వేదం.
ఈ సుదినాన మిత్రులారా, మీకు యోగా దినోత్సవ శుభాకాంక్షలు!
నిరంతర పరుగుల ప్రయాణంలో బందీ అయిన మనసుకు
కాసేపు విశ్రాంతినిచ్చే అమృత ఘుడియ యోగం
ఆసనాల కలయిక కేవలం దేహ శ్రమ కాదు,
అది ఆత్మను ప్రకృతితో ముడి వేసే ఒక పవిత్ర బంధం.
ప్రాణాయామపు లోతైన శ్వాసను పీల్చినప్పుడు
శరీరంలోని ప్రతి అణువు కొత్తగా పుడుతుంది.

కనురెప్పల వెనుక ప్రపంచాన్ని నిశ్శబ్దం చేసినప్పుడు మనసులోని ఆందోళనలన్నీ మంచులా కరిగిపోతాయి,యోగా అంటే కేవలం శరీరాన్ని వంచడం కాదు, అహంకారాన్ని వంచి, హృదయాన్ని తెరవడం.దూరాలను చెరిపేసి, ద్వేషాన్ని తుడిచేసి ప్రపంచమంతా ఒకటే అని చాటి చెప్పే ఐక్యత రాగం.ఈ యోగపతంలో అడుగులు వేస్తూ ఆరోగ్యకరమైన తనువును, ప్రశాంతమైన మనసును పొందుదాం. ఒత్తిడి లేని సమాజాన్ని మనమంతా కలిసి నిర్మిద్దాం. మిత్రులారా.. ఈ యోగ సాధన మీ జీవితాల్లో...నిత్య సంతోషాన్ని, నిండు ఆరోగ్యాన్ని నింపాలని ఆకాంక్షిస్తూ...
మన యోగ గురువులు, మల్లాది శ్రీరామ్మూర్తి కి, కీర్తి సురేష్ కి ధన్యవాదములతో,
మరోసారి అందరికీ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ,


మీ,
బత్తుల వెంకటేశ్వర్లు, చర్ల.

# మెదక్ జిల్లా టూరిజం హబ్‌గా తీర్చిదిద్దేలా ప్రభుత్వం పటిష్ట ప్రణాళిక

- జిల్లాలో వివిధ పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి 2.5 కోట్ల రూపాయలు కేటాయింపు.
- మెదక్ ఖిల్లాకు తక్షణ అవసరాల కోసం 57 లక్షలు మంజూరు.
- మెదక్ జిల్లాలో 99 రోజుల ప్రగతి ప్రణాళిక జయకేతనం టూరిజం శాఖ ప్రధాన కార్యదర్శి ,మెదక్ జిల్లా ప్రత్యేక అధికారి వాణి ప్రసాద్.
- జిల్లాలో ప్రజా పాలన విజయవంతం
- ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికతో ప్రజల జీవితాల్లో గణనీయ మార్పు.
- ప్రజా ప్రతినిధులు అధికారుల సమన్వయంతో సక్సెస్ ఫుల్.
- మెదక్ జిల్లా ఖిల్లాను పరిశీలించిన టూరిజం శాఖ ప్రత్యేక కార్యదర్శి వాణి ప్రసాద్.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 22(జన సంఘర్షణ)

సోమవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం విజయవంతం లో భాగంగా మెదక్ జిల్లా సమీక్షా సమావేశం మెదక్ ఖిల్లా పై నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ టూరిజం శాఖ కార్యదర్శి వాణి ప్రసాద్, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. మెదక్ కిలకోటను సందర్శించిన టూరిజం ప్రజా ప్రధాన కార్యదర్శికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా టూరిజం అభివృద్ధి ప్రణాళిక సుదీర్ఘంగా వివరించడం జరిగింది. ఈ సందర్భంగా టూరిజం శాఖ కార్యదర్శి వాణి ప్రసాద్ మాట్లాడుతూ...99 రోజులు 10 ప్రధాన అంశాల తో ప్రజల భాగస్వామ్యంతో సమగ్ర అభివృద్ధి, గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు విజయవంతమైన కార్యాచరణ పారదర్శక పరిపాలన వేగవంతమైన సేవలు.. సుస్థిర అభివృద్ధికి నూతన దిశగా మెదక్ జిల్లా ముందు వరుసలో ఉంటుందన్నారు. 99 రోజులపాటు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమం మెదక్ జిల్లాలో చారిత్రాత్మకంగా నిలిచిందన్నారు. ప్రజల జీవితాల్లో పెను మార్పులను తీసుకువచ్చిందని కొనియాడారు. గ్రామ గ్రామాన వార్డు మెంబర్ నుంచి శాసనసభ్యులు, మంత్రుల వరకు.. మరోపక్క పంచాయతీ కార్యదర్శి నుంచి జిల్లా కలెక్టర్ వరకు..అందర్నీ భాగస్వామ్యం చేసి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక. ఇంతకు మునుపెన్నడూ జరగని విధంగా ఈ కార్యక్రమం 99 రోజులపాటు మెదక్ జిల్లాలో నిరాటకంగా జరగడం విశేషంగా . అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ అయ్యేలా చేసిందని వెల్లడించారు.. నియోజకవర్గాల్లో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల ముందు ఉంచింది. మెదక్ జిల్లా ఆదర్శంగా నిలిచిందన్నారు. జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ప్రజల సహకారంతో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక దిగ్విజయంగా పూర్తయింది. అని వెల్లడించారు. మెదక్ జిల్లా పర్యాటక రంగం అభివృద్ధి దిశగా ముందుకు పోతుందని పర్యాటకులు ఆకర్షించే విధంగా ఖిలాను అభివృద్ధి చేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వానికి నివేదికలు సమర్పించి తద్వారా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. మెదక్ ఖిల్లా జిల్లాకు గర్వకారణం అని అన్నారు. ఖిల్లాలో వారసత్వ,సాంస్కృతిక అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నామని, మెదక్ జిల్లాలో పర్యాటక అభివృద్ధికి పెద్ద పీట వేస్తామన్నారు. మెదక్ ఖిల్లా ను మరింత ప్రాచర్యంలోకి తెస్తామన్నారు. మెదక్ ఖిల్లాపై నిరంతరం సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు చేపడతామన్నారు. ఖిల్లా పై బాల బాలికలను ఆకర్షించేలా ప్రత్యేక కార్యక్రమాల రూపొందించాలన్నారు. జిల్లాలో వివిధ పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి 2.5 కోట్ల రూపాయలు



కేటాయించామని, అవి టెండర్ స్టేజీలో ఉన్నాయన్నారు. మెదక్ ఖిల్లాకు తక్షణ అవసరాల కోసం 57 లక్షలు మంజూరు చేశామన్నారు. జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ మాట్లాడుతూ.. మెదక్ జిల్లా పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని ఇందులో భాగంగా టూరిజం ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్ ఖిలాకోటను సందర్శించడం శుభపరిణామం అన్నారు. భవిష్యత్తులో మెదక్ పర్యాటక ప్రాంత సర్వాంగ సుందరంగా తయారు కాబోతుందని వివరించారు. ప్రజా పాలన 99 రోజుల ప్రగతి ప్రణాళిక జిల్లాలో అధికారుల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించామని ఈ సందర్భంగా వెల్లడించారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మెదక్ జిల్లాలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆలైవ్ అరైవ్ కార్యక్రమాలు నిర్వహించామని, మూడు కంటి పరీక్షల క్యాంపులు, నాలుగు హెల్మెట్ పంపిణీ కార్యక్రమాలు నిర్వహించి జిల్లాలో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించమన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ అంబాదాస్ రాజేశ్వర్, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆడపిల్లల ఉజ్వల భవిష్యత్తుకు మార్షల్ ఆర్ట్స్ అవసరం

- ఐపీఎస్ లక్ష్యంగా విద్యార్థినికి దిశా నిర్దేశం

పాల్వంచ జూన్ 22 (జన సంఘర్షణ)



ఆడపిల్లలు ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో సమాజంలో ఎదగడానికి వారి నిర్భయ భవిష్యత్తుకు మార్షల్ ఆర్ట్స్ ఎంతో దోహదపడతాయని ఎక్స్‌ట్రీమ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ గ్రాండ్ మాస్టర్ కోనే సూరిబాబు పేర్కొన్నారు. పాల్వంచలోని డీఏవీ మోడల్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న హర్షిక అనే విద్యార్థిని, భవిష్యత్తులో ఐపీఎస్ అధికారి కావాలనే బలమైన సంకల్పంతో ముందుకు సాగుతోంది. ఈ సందర్భంగా అకాడమీ ఆధ్వర్యంలో ఆమెకు మార్షల్ ఆర్ట్స్ ద్వారా ఆత్మరక్షణ, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, దేశసేవ పట్ల అవగాహన కల్పిస్తూ ప్రత్యేక దిశా నిర్దేశం చేశారు. విద్యార్థులకు కేవలం చదువు మాత్రమే కాకుండా శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యం కూడా సమానంగా అవసరమని ఈ సందర్భంగా పెద్దలు సూచించారు. ఈ వినూత్న కార్యక్రమంలో కేటీపీఎస్ అసిస్టెంట్ కమాండెంట్ చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన ఐపీఎస్ లక్ష్య సాధనలో విద్యార్థిని హర్షికకు క్రమశిక్షణ, నిరంతర కృషి, దేశభక్తి ప్రాముఖ్యతను వివరించారు. నేటి తరం విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటిని సాధించేందుకు నిరంతరం శ్రమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఆడపిల్లలు సమాజంలో అన్ని రంగాలలో రాణించాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలిచింది. భవిష్యత్తులో హర్షిక తన కలను నిజం చేసుకుని, ఉన్నత స్థానాలను అధిరోహించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, నిర్వాహకులు మరియు ప్రముఖులు ఆకాంక్షిస్తూ ఆమెకు అభినందనలు తెలిపారు.

# వరంగల్‌లో పార్టీ బలోపేతంపై కీలక చర్చలు..

వరంగల్/జూన్ 22/(జన సంఘర్షణ)





వరంగల్ జిల్లాలో పలు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విచ్చేసిన ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ ఎం.నటరాజన్ ఐఎన్‌సా, టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేష్‌గౌడ్6666 లకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి ఘన స్వాగతం పలికాము. అనంతరం ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో వారితో సమావేశమై, పార్టీ సంస్థాగత బలోపేతం, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం, ప్రజా సమస్యలు మరియు పార్టీ భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించడం జరిగింది. ప్రజలకు మరింత చేరువై, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే దిశగా సమిష్టిగా ముందుకు సాగాలని నిర్ణయించాము.

# అంతర్ రాష్ట్ర గంజాయి ముఠా అరెస్ట్- నిందితులు

నిజామాబాద్ జిల్లా/జూన్ 22/(జన సంఘర్షణ)

నిజామాబాద్ జిల్లాకు చెందిన వారిగా గుర్తింపు-వీరి వద్ద నుండి 1.93కోట్ల విలువచేసే 387.128 కిలోలు గంజాయి స్వాధీనం.- వివరాలు వెల్లడించిన కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్. ఒడిశా నుంచి మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న అంతర్ రాష్ట్ర గంజాయి ముఠా గుట్టును కామారెడ్డి దేవునిపల్లి పోలీసులు రట్టు చేసినట్లు కామారెడ్డి ఎస్పీ రాజేష్ చంద్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. జిల్లాలోని క్యాసంపల్లి జాతీయ రహదారి మీదుగా పనసపండ్ల మాటున గంజాయి రవాణా చేస్తున్న అంతర్ రాష్ట్ర ముఠా సభ్యులు ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.1.93కోట్ల విలువచేసే 387.128 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులు నిజామాబాద్ జిల్లాకు చెందిన కరిముల్ల, సుభాష్, రహీమ్గా గుర్తించారు. వీరి వద్ద నుండి అశోక లేలాండ్ వాహనం, 2 ఫోన్లు, 500 నగదు, స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్కు తరలించారు. గంజాయి ముఠాను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులకు కామారెడ్డి ఎస్పీ రాజేష్ చంద్ రివార్డులు ప్రకటించారు.



జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం · తెలుగు దినపత్రిక
మంగళవారం
23 జూన్ 2026

# ఇల్లందులో ఆధ్యాత్మిక శోభ: 40 మంది బాల బాలికలకు భగవద్గీత శిక్షణ

- భగవద్గీత ఒక జీవన విధానం: ఇల్లందు ఆధ్యాత్మిక సమావేశంలో ముఖ్య అతిథులు.
- రాందేవ్ బాబా మందిరంలో ఘనంగా గీతా పరివార్ సర్టిఫికెట్ల ప్రదానోత్సవం.
- భారతీయ సంస్కృతిని కాపాడుకుందాం: దేవాలయాల్లో గీతా శిక్షణా కేంద్రాల ఏర్పాటుకు పిలుపు.
- ఇల్లందు గీతా పరివార్ ఆధ్వర్యంలో ముగిసిన వేసవి శిక్షణ.. ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు.





ఇల్లందు జూన్ 22 (జన సంఘర్షణ)
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు పట్టణంలో వేసవి సెలవులను పురస్కరించుకొని బాలబాలికలకు నిర్వహించిన భగవద్గీత శిక్షణా తరగతులు విజయవంతంగా ముగిశాయి. గీతా పరివార్ తెలంగాణ రాష్ట్రం ఇల్లందు శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టారు.

**రెండు అధ్యాయాల పఠనం**

ఈ వేసవి శిక్షణా శిబిరంలో మొత్తం 40 మంది బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. వీరందరికీ గీతా పరివార్ ఇల్లందు శాఖ నిర్వాహకురాలు పుల్లూరు ఉమాదేవి గుప్తా ఎంతో భక్తిశ్రద్ధలతో భగవద్గీతలోని రెండు ముఖ్యమైన అధ్యాయాలను స్పష్టంగా పఠించడం నేర్పించారు.

**ఆధ్యాత్మిక సమావేశం**

శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు స్థానిక రాందేవ్ బాబా మందిరంలో ఒక ప్రత్యేక ఆధ్యాత్మిక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ ముగింపు వేడుకకు విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు పట్టణ ప్రముఖులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

**ప్రశంసాపత్రాల బహుకరణ**

ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా వార్డు కౌన్సిలర్ పాబోలు స్వాతి, మామిడి జయప్రకాష్, గురుకృప బాలకృష్ణ, మరియు గాయత్రి పరివార్‌కు చెందిన డాక్టర్ సతీష్ ఖండేల్వాల్ విచ్చేశారు. శిక్షణ పూర్తి చేసుకున్న బాలబాలికలకు గీతా పరివార్, ఇస్కాన్ సంస్థలు సంయుక్తంగా అందించిన ప్రశంసాపత్రాలను అతిథుల చేతుల మీదుగా బహుకరించారు.

**భగవద్గీత ఒక జీవన విధానం**

ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ, భగవద్గీత కేవలం ఒక పవిత్ర గ్రంథం మాత్రమే కాదని, అది ప్రతి ఒక్కరూ అనుసరించాల్సిన అద్భుతమైన జీవన విధానం అని కొనియాడారు. చిన్నతనం నుంచే పిల్లలకు గీతను అలవాటు చేయడం వల్ల వారిలో నైతిక విలువలు పెరుగుతాయని పేర్కొన్నారు.

**సంస్కృతి, సంప్రదాయాల రక్షణ:**

విద్యార్థులలో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ధర్మం పట్ల అవగాహన పెంచాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని అతిథులు స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ మన సంస్కృతిని గౌరవిస్తూ, ధర్మాన్ని ఆచరించాలని వారు పిలుపునిచ్చారు.

**శిక్షణా కేంద్రాల విస్తరణకు పిలుపు**

పట్టణంలోని ప్రతి వార్డులో ఉన్న దేవాలయాలలో ఇలాంటి గీతా శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఉదాత్తమైన కార్యక్రమానికి స్థానిక వ్యాపారస్తులు, పట్టణ ప్రముఖులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు తమ వంతు సహకారాన్ని అందించాలని వారు కోరారు.

**భక్తుల భాగస్వామ్యం**

ఈ ముగింపు వేడుకలో బాబోలు కిరణ్, పుల్లూరు రజనీకాంత్, కటకం అలేఖ్యలతో పాటు పట్టణానికి చెందిన అనేకమంది భక్తులు, మహిళలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పిల్లల శ్లోక పఠనం అందరినీ ఎంతగానో ఆకట్టుకుంది.

# టేకులపల్లిలో ఎమ్మెల్యే కోరం కనకయ్య పర్యటన

- ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు షురూ
- పూలవర్షం, డీజే మోతలతో ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికిన బొమ్మనపల్లి ప్రజలు.
- పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్న ఏకైక ప్రభుత్వం ఇందిరమ్మ ప్రభుత్వం: ఎమ్మెల్యే కోరం కనకయ్య.





ఇల్లందు జూన్ 22 (జన సంఘర్షణ)
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలో ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు గౌరవ కోరం కనకయ్య అధికారిక పర్యటన అత్యంత ఉత్సాహభరితంగా ప్రారంభమైంది. మండల పరిధిలోని బొమ్మనపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు.

**ఎమ్మెల్యే కనకయ్యకి ఘన స్వాగతం**

గ్రామానికి చేరుకున్న శాసనసభ్యులు కోరం కనకయ్యకి స్థానిక గ్రామ ప్రజలు, లబ్ధిదారులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు బ్రహ్మరథం పట్టారు. మహిళలు హారతులు పట్టగా, డీజేల మోతలు, పూల వర్షం కురిపిస్తూ ఎమ్మెల్యేకి అత్యంత ఘనంగా మరియు ఉత్సాహభరిత వాతావరణంలో స్వాగతం పలికారు.

**నూతన ఇందిరమ్మ ఇల్లు ప్రారంభం**

అనంతరం ఏర్పాటు చేసిన గృహప్రవేశ మహోత్సవంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య లబ్ధిదారులతో కలిసి పాల్గొన్నారు. సాంప్రదాయబద్ధంగా రిబ్బన్ కట్ చేసి, నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి, లబ్ధిదారుల కుటుంబాలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

**ప్రభుత్వ లక్ష్యం ఇదే**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,.. సమాజంలో గూడులేని నిరుపేద కుటుంబాలకు అండగా నిలవడమే తమ ప్రభుత్వ ప్రధాన ఆశయమన్నారు. ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు అందించి, వారికి గౌరవప్రదమైన నివాసాన్ని కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన స్పష్టం చేశారు.


**ఐదు లక్షల ఆర్థిక సాయం**

పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ప్రభుత్వం ద్వారా రూ. 5,00,000 (ఐదు లక్షల రూపాయల) భారీ ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నామని ఎమ్మెల్యే వివరించారు. తమకు సొంత గూడు కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక చొరవ తీసుకున్న ఎమ్మెల్యే కోరం కనకయ్యకి లబ్ధిదారులు ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.

**ప్రముఖుల భాగస్వామ్యం**

ఈ సంబరాల్లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లక్కినేని శ్యామ్, స్థానిక ఎంపీడీవో (వీణా), మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కాలే ప్రసాద్, హౌసింగ్ ఏఈ గణేష్‌లతో పాటు మండల, గ్రామ స్థాయి కాంగ్రెస్ నాయకులు, అధికారులు, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

# 2012 సంవత్సరంలో వార్తలు రాసిన పాపానికి మొదటి కేసు రేప్ కేసు



రుద్రూర్/జూన్ 22/(జన జన సంఘర్షణ)
కొంతమంది లోకల్ లీడర్లు అప్పటి వర్ని పోలీస్ స్టేషన్లో...ద గ్రేట్ ఎస్ఐ సార్ జక్కుల హనుమంతు. దేవుడు ఆయనలాంటి ఎస్సై ఉండబోరు ఉండరు కూడా రియల్లీ హాట్సాఫ్ ఎస్ఐ సర్‌కి నా మీద కేసు కోసం పోలీస్ స్టేషన్ తిరిగిన నా గురించి తెలిసి ఆ సారు చేయలే అయితే ప్రవేట్ కేసు వేసి నాపై ఎఫ్ఆర్ నమోదు చేశారు. మరుసటి రోజు నాకు రిమాండ్ చెయ్యాలని ప్లానింగ్ కానీ ఆ మంచి ఆఫీసరు ఆయన కడుపు చల్లగా ఉండాలి. ఆయన కుటుంబం సల్లగా ఉండాలి. దేవుడు ఆయనకు మంచిగా చూడాలి. అలాంటి ఆఫీసర్ నిజంగా దేవుడు రాత్రికి రాత్రి నన్ను ఇన్ఫర్మేషన్ ఇచ్చి అలర్ట్ చేసిన దేవుడు. జక్కుల హనుమాన్ నా పాలిట దేవుడు అలాంటి ఆఫీసర్ ఇప్పటివరకు నాకు కనిపియ్యలే. ఇక అప్పటినుంచి ఇప్పటివరకు ఇప్పుడు రెండు కేసులు అప్పటినుంచి కేసులే కేసులు నేను చనిపోయే వరకు కేసులు అయితేనే ఉంటాయి. నా జీవితంలో వెంటాడి వేటాడి అక్రమ కేసులు బనాయించి నా కుటుంబం రోడ్డున నేను రోడ్డున నన్ను ఎప్పుడు జైల్లో వేయాలి, ఎన్ని తప్పుడు కేసులు చేయాలి, ఎలా ఇరికించాలి అని ఆలోచన తప్ప నాకు మంచి చేయాలని ఆలోచన లేకపోవడం దారుణం. నా డ్యూటీ నేను వార్తలు రాస్తున్న క్రమంలో నా డ్యూటీ చేయనీయకుండా కేసుల పేరుతో భయభ్రాంతులకు గురిచేయడం నన్ను వేధించడం, ఇబ్బందుల పాలు చేయడం నన్ను ఇరికించడం ఆర్థికంగా మానసికంగా శారీరకంగా నన్ను రోడ్డుపాలు చేయడం బాధ పెట్టడం చాలా దారుణం.

**రుద్రూర్లో 2016 జనవరి 16, రుద్రూర్లో 2023 జూన్ మూడు నాలుగు హత్యాయత్నం**

ఇలా నన్ను ఇబ్బంది పాలు చేయడమే కంకణం కట్టుకున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు ఇప్పుడు కూడా ఇరికించాలని నిపంతో రుద్రూర్లో మరొక కేసు కేసుల పరంపర కొనసాగుతూనే ఉంటుంది నా జీవితంలో.

# సైబర్ నేరాలు, ఫోన్ యాప్‌లపై అవగాహన కల్పించిన పోలీసులు అధికారులు




బీర్కూర్ / జూన్22/(జన సంఘర్షణ)
బీర్కూర్ మండల కేంద్రంలోని సాయిలు టీ పాయింట్ ప్రాంతంలో సోమవారం బీర్కూర్ హెడ్ కానిస్టేబుల్ లు నందా నాయక్, యాదగిరి, లక్ష్మణ్, పి.సీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీర్కూర్ గ్రామ సర్పంచ్ ధర్మ తేజ సహకారంతో సైబర్ నేరాలు, ఫోన్ యాప్ లపై టీ తాగడానికి విచ్చేసిన సోదరులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు పెరుగుతున్న సమయంలో సైబర్ నేరాలు, ఫోన్ లలో ఇష్టా రీతిగా యాఫ్ లు పెరగడంతో పాటు, నకిలీ యాప్ లు రావడం, ఆన్లైన్ నేరాలు, మోసపూరితమైన లింకుల పట్ల సాయల్ టీ పాయింట్ వద్దా పలు అంశాలను వివరించారు. హెడ్ కానిస్టేబుల్ నంద నాయక్ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు పంపే లింకులు క్లిక్ చేయవద్దని, వ్యక్తిగత బ్యాంక్ ఖాత వివరాలు, ఓటీపీలు, ఏటీఎం పిన్ నెంబర్లు, ఎవరికి తెలియజేయవద్దని సూచించారు. అలాగే పెట్టుబడుల పేరుతో అధిక లాభాలు వస్తాయని చెప్పే నకిలీ యాప్ లు, లోన్ యాపులు, ఉద్యోగాల పేరుతో మోసాలు చేసే వెబ్సైట్లు, సోషల్ మీడియా ఖాతాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే1930 హెల్ప్ లైన్ కు ఫిర్యాదు చేసుకోవలని సూచించారు. ప్రజలు తమ మొబైల్ ఫోన్లలో భద్రతా సెట్టింగ్లను ఉపయోగించుకోవడంతోపాటు అధికారిక యాప్ లనే డౌన్లోడ్ చేసుకోవాలని పోలీసులు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, ఫోన్ యాప్ ల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండీ తమ వ్యక్తిగత ఆర్థిక సమాచారాన్ని రక్షించుకోవాలని అన్నారు, ఈ కార్యక్రమంలో స్థానిక వ్యాపారులు, యువకులు, వయోజనులు చిన్నలు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# బోధన్ బల్దియాలో కలకలం..

- టెంట్ వేసుకుని ఎంఐఎంకౌన్సిలర్ల ధర్నా.



బోధన్: /జూన్ 22/(జన సంఘర్షణ)
పట్టణంలో ఎంఐఎం కౌన్సిలర్లు ఆందోళన బాట...పట్టారు. బల్దియా కార్యాలయం ఎదుట సోమవారం టెంట్ వేసుకొని ధర్నాచేశారు. మున్సిపల్ పాలకవర్గం ఏర్పడి మూడు నెలలు అవుతున్న ప్పటికీ ఇప్పటివరకు ఒక్కసారి కూడా కౌన్సిల్ మీటింగ్ నిర్వహించలేద ని ఎంఐఎం కార్పొరేటర్లు ఆరోపించారు. బల్దియా వైస్ ఛైర్మన్ ఇలియాస్ మాట్లాడుతూ పట్టణంలో శానిటైజేషన్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింద న్నారు. పాలకవర్గం సమావేశం నిర్వహించి అధికారులకు సూచనలు సలహాలు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటివరకు సమావేశం నిర్వహించకపో వడంతో పట్టణంలో పాలన గాడి తప్పిందన్నారు. కాలనీల్లో ఎలాంటి సమస్యలు పరిష్కారం కావట్లేదని.. దీంతో ప్రజల మధ్య తిరగలేకపోతు న్నామని వైస్ ఛైర్మన్ అన్నారు. అధికారుల మధ్య సమన్వయ లోపం స్ప ష్టంగా కనిపిస్తోందని దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పట్టణ శివారులోని పసుపు వాగులో దర్జాగా బల్దియా బీసీబీలతో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని ఆరోపణలు వస్తున్నా యని ఇది ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు.

# కోటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉచిత పుస్తకాల పంపిణీ



కోటగిరి/జూన్ 22/(జన సంఘర్షణ)
కోటగిరి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమ వారం విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్ర మంలో విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని, విద్యార్థులు చదువులో రాణించాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పిల్లలు, తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమగ్ర సమీక్ష



హుజూర్ నగర్/జూన్ 22/(జన సంఘర్షణ)
ఈరోజు హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో హుజూర్ నగర్, కోదాడ నియోజక వర్గాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమగ్ర సమీక్ష నిర్వహించారు. సమావేశంలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి , జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, పంచాయతీ రాజ్, హౌసింగ్ శాఖల అధికారులు, కాంట్రాక్టర్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
మంగళవారం
23 జూన్ 2026

# కార్మికులు, ఉద్యోగులు కదలిరండి..

- సింగరేణి రక్షణ సదస్సుకు దిండిగల రాజేందర్ పిలుపు
- కొత్తగూడెం క్లబ్‌లో రేపు సింగరేణి మహాసదస్సు.. పోస్టర్ విడుదల చేసిన దిండిగల రాజేందర్, జాఫర్ హుస్సేన్
- ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ సీనియర్ నేత హరీష్ రావు.. సదస్సును జయప్రదం చేయాలన్న దిండిగల రాజేందర్
- సింగరేణి మనుగడను కాపాడుకుందాం.. ఇల్లందులో గర్జించిన ఉద్యమ నాయకుడు దిండిగల రాజేందర్
- రేపు కొత్తగూడెంలో సింగరేణి పరిరక్షణ సదస్సు.. కదంతొక్కనున్న 11 ఏరియాల కార్మిక లోకం



ఇల్లందు జూన్ 22 (జన సంఘర్షణ)
తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) ఆధ్వర్యంలో రేపు సాయంత్రం 4 గంటలకు కొత్తగూడెం క్లబ్‌లో ప్రతిష్టాత్మకమైన "సింగరేణి పరిరక్షణ సదస్సు" నిర్వహించనున్నారు. సింగరేణి సంస్థ మనుగడను, కార్మికుల హక్కులను కాపాడుకోవడమే ధ్యేయంగా ఈ సదస్సును ఏర్పాటు చేశారు.

**పోస్టర్ ఆవిష్కరణలో ఉద్యమ నేత**

సదస్సుకు సంబంధించిన ముందస్తు ఏర్పాట్లలో భాగంగా ఇల్లందులో "సింగరేణి పరిరక్షణ సదస్సు" వాల్ పోస్టర్‌ను అధికారికంగా విడుదల చేశారు. మాజీ గ్రంథాలయ శాఖ చైర్మన్, ప్రముఖ ఉద్యమ నాయకులు దిండిగల రాజేందర్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై పోస్టర్లను ఆవిష్కరించారు.

**రాజేందర్ నేతృత్వంలో ఏర్పాట్లు**

టీబీజీకేఎస్ ఇల్లందు ఏరియా ఉపాధ్యక్షులు జాఫర్ హుస్సేన్‌తో కలిసి దిండిగల రాజేందర్ ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ముందుండి నడిపించారు. ఇల్లందు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న కార్మిక శ్రేణులను సన్నద్ధం చేయడంలో ఆయన చురుకైన పాత్ర పోషిస్తున్నారు.

**ముఖ్య అతిథిగా హరీష్ రావు**

కొత్తగూడెంలో జరగబోయే ఈ మహా సదస్సుకు ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ శాసనసభ పక్ష ఉపనేత, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు హాజరుకానున్నారు. సింగరేణి సంస్థ ఎదుర్కొంటున్న సవాళ్లు, కార్మికులకు జరగాల్సిన న్యాయంపై ఆయన దిశానిర్దేశం చేయనున్నారు.

**దిండిగల రాజేందర్ ఘన నివాళి, పిలుపు**

పోస్టర్ విడుదల అనంతరం ఉద్యమ నాయకులు దిండిగల రాజేందర్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనలోనూ, సింగరేణి ప్రగతిలోనూ కార్మికుల శ్రమ వెలకట్టలేనిదని కొనియాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో సింగరేణి రక్షణ కోసం ప్రతి ఒక్కరూ నడుం బిగించాలన్నారు.

**సింగరేణి మనుగడను కాపాడుకుందాం**

సింగరేణి సంస్థ మనుగడను, హక్కులను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ కలిసిరావాల్సిన సమయం ఆసన్నమైందని దిండిగల రాజేందర్ స్పష్టం చేశారు. కార్మిక లోకం అంతా ఏకతాటిపైకి వచ్చి కొత్తగూడెం సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

**11 ఏరియాల నాయకులకు ఆహ్వానం**

కొత్తగూడెం క్లబ్‌లో జరిగే ఈ సదస్సుకు కేవలం ఇల్లందు నుంచే కాకుండా, సింగరేణి వ్యాప్తంగా ఉన్న మొత్తం 11 ఏరియాలకు చెందిన యూనియన్ ప్రతినిధులు, రాష్ట్ర స్థాయి నాయకులు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

**ప్రజాప్రతినిధులు కదలిరావాలి:**

ఈ సదస్సుకు మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, వివిధ హోదాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు అందరూ హాజరై కార్మికులకు అండగా నిలబడాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.

**కార్మిక శ్రేణుల ఐక్యత**

సింగరేణి కార్యకర్తలు మరియు అటు కార్మికులు, ఇటు ఉద్యోగులు అందరూ తమ విధులకు ఇబ్బంది లేకుండా పెద్ద సంఖ్యలో హాజరుకావాలన్నారు. కార్మిక శక్తి ఏంటో ఈ సదస్సు ద్వారా చాటి చెప్పాలని కోరారు.

**విజయవంతం చేయడమే ధ్యేయం**

ఈ సదస్సుకు ఘన విజయం చేకూర్చడమే లక్ష్యంగా ఇల్లందు ఏరియా వ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు టీబీజీకేఎస్ ఇల్లందు ఏరియా ఉపాధ్యక్షులు జాఫర్ హుస్సేన్ ఈ సందర్భంగా వివరించారు.

**యూనియన్ నేతల సంఘీభావం**

ఈ పోస్టర్ విడుదల కార్యక్రమంలో టీబీజీకేఎస్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎస్. రంగనాథ్ పాల్గొని, హరీష్ రావు పర్యటనను, సదస్సును సక్సెస్ చేయడానికి యూనియన్ శ్రేణులన్నీ అహోరాత్రులు శ్రమిస్తున్నాయని తెలిపారు.

**ముఖ్య నాయకుల హాజరు**

కార్మిక సంఘం మాజీ ఉపాధ్యక్షులు అబ్దుల్ నబీ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని, కార్మికుల సంక్షేమం కోసం టీబీజీకేఎస్ ఎల్లప్పుడూ ముందుంటుందని, ఈ సదస్సు దానికి ఒక వేదిక కానుందని పేర్కొన్నారు.

**భారీగా తరలనున్న ఇల్లందు శ్రేణులు**

ఇల్లందు ఏరియా నుండి వందలాది మంది కార్మికులు, ఉద్యోగులు స్వచ్ఛందంగా తరలివెళ్లేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు పోస్టర్ విడుదల సందర్భంగా నాయకులు వెల్లడించారు.

**కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు**

ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు ఉపేందర్ రావు, రామ్ లాల్, శివ, ఇమ్రాన్, కిషన్ తదితరులు పాల్గొని, సింగరేణి పరిరక్షణ సదస్సు జయప్రదం కావాలని కాంక్షిస్తూ నినాదాలు చేశారు.

# నిరుపేద, నిజమైన అన్నదాతలకు రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం అత్యంత భారీ ఊరట

హైదరాబాద్/జూన్ 22/(జన సంఘర్షణ)
రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై భారం పడినప్పటికీ, ఖరీఫ్ (వానాకాలం) సీజన్ ప్రారంభమైనందున రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది. ఈ నెల 30న ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గ కేంద్రంలో జరగనున్న భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా బటన్ నొక్కి నిధులను విడుదల చేయనున్నారు. ఈ విడతలో మొత్తం 73 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ. 9,000 కోట్ల నిధులను నేరుగా జమ చేసేందుకు వ్యవసాయ శాఖ పక్కా ప్రణాళికను రూపొందించింది. ఈ విడత రైతు భరోసా అమలు మరియు ప్రభుత్వం తీసుకోబోతున్న విప్లవాత్మక, హైటెక్ నిర్ణయాల ముఖ్యాంశాలు ఇవే:

**1. 9 రోజుల్లో సంపూర్ణ పంపిణీ - ప్రత్యామ్నాయ ప్లాన్ సిద్ధం:**

గత యాసంగి (రబీ) సీజన్‌లో కేవలం రెండు ఎకరాల లోపు ఉన్న వారికే పెట్టుబడి సాయం అందడంతో క్షేత్రస్థాయిలో వచ్చిన ఫీడ్‌బ్యాక్‌ను సీఎం సానుకూలంగా పరిశీలించారు. ఈసారి అందరికీ ఒకేసారి నిధులు జమ చేయాలని భావిస్తోంది. ఒకవేళ నిధుల లభ్యతను బట్టి ఎలాంటి కొరత ఎదురైనా.. మొదట ఎకరం చొప్పున ప్రారంభించి, కేవలం 9 రోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ ప్రక్రియ మొత్తాన్ని క్లియర్ చేసేలా వ్యవసాయ శాఖ బ్యాకప్ ప్లాన్‌ను కూడా సిద్ధం చేసుకుంది.

**2. బోగస్ జాబితాకు కత్తెర - 25 లక్షల ఎకరాల తొలగింపు:**

గత ప్రభుత్వంలా ప్రజా ధనం వృథా కాకుండా, కేవలం నిజంగా సాగు చేసే రైతులకే ఈ సాయం అందేలా రేవంత్ ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోబోతోంది. రాష్ట్రంలో ఉన్న 1.50 కోట్ల ఎకరాల భూమిలో సాగుకు పనికిరాని పడావు భూములు, రియల్ ఎస్టేట్ వెంచర్లు, కాలువలు, కుంటలు మరియు కంకర బీడు భూములు ఉన్న 20 నుండి 25 లక్షల ఎకరాలను భరోసా జాబితా నుండి శాశ్వతంగా తొలగించనున్నారు.

**3. పేద, మధ్యతరగతి రైతులకు ప్రాధాన్యత:**

ధనవంతులైన పెద్ద భూస్వాములకు కాకుండా అర్హులైన పేద, మధ్యతరగతి రైతులకు గరిష్ట లబ్ధి చేకూర్చేలా ఈ వానాకాలం సీజన్ నుండి 7 ఎకరాల 20 గుంటల వరకు భూమి ఉన్న వారికే భరోసా సాయం పరిమితం చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. 10 ఎకరాల కంటే ఎక్కువ భూమి ఉన్నవారిని ఈ జాబితా నుండి మినహాయించే అవకాశం ఉంది. అలాగే పత్తి వంటి పంటలు రబీలో సాగు చేయనందున.. దీనిపై ప్రభుత్వం మరిన్ని కీలక సమాలోచనలు చేస్తోంది. కౌలు రైతులను ఆదుకునేందుకు ఒక ప్రత్యేక చట్టాన్ని కూడా తీసుకురావాలని మంత్రులు సీఎంకు ప్రతిపాదించారు.

**4. స్విట్జర్లాండ్ టెక్నాలజీ - 95% ఖచ్చితత్వంతో శాటిలైట్ సర్వే:**




ఇకపై రైతు భరోసాలో ఎలాంటి అవినీతి, బోగస్ క్లెయిమ్‌లకు తావులేకుండా ప్రభుత్వం అంతర్జాతీయ స్థాయి హైటెక్ టెక్నాలజీని వాడుతోంది: సార్ మ్యాప్ ఒప్పందం: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో స్విట్జర్లాండ్ దేశానికి చెందిన ప్రముఖ 'సార్ మ్యాప్' సంస్థతో ఒప్పందం కుదుర్చుకుని శాటిలైట్ (ఉపగ్రహ) చిత్రాల ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా సర్వే నిర్వహించారు. 95 శాతం ఖచ్చితత్వం: ఈ అంతరిక్ష సర్వే ద్వారా రాష్ట్రంలో ఏ గ్రామంలో, ఏ సర్వే నంబర్‌లో, ఏ పంట వేశారనేది 95 శాతం ఖచ్చితత్వంతో డిజిటల్ మ్యాపింగ్ చేశారు. పైలట్ ప్రాజెక్ట్ సక్సెస్: జిల్లాకు 5 గ్రామాల చొప్పున ఎంపిక చేసి ఏఈఓ లతో క్షేత్రస్థాయిలో క్రాస్ చెక్ చేయించగా.. శాటిలైట్ వివరాలు, గ్రౌండ్ రిపోర్ట్ 100% ఒక్కటిగానే వచ్చాయి. దీనివల్ల కేవలం పంట సాగు చేసిన అసలైన రైతులకే ప్రభుత్వ లబ్ధి చేకూరుతుంది. అంతేకాకుండా భవిష్యత్తులో ప్రకృతి విపత్తుల వల్ల పంట నష్టపోతే ఎలాంటి దళారీలు లేకుండా నేరుగా అకౌంట్లకే నష్టపరిహారం అందించడానికి, విత్తనాలు-ఎరువులు ముందే ఏ ప్రాంతానికి ఎంత కావాలో సిద్ధం చేసుకోవడానికి ఈ డేటా బేస్ ప్రభుత్వానికి అత్యంత కీలకంగా మారనుంది.

# ఇసుక మాఫియా అక్రమాలకు బలైన నిండు ప్రాణం

- అంబులెన్స్‌కు దారివ్వని లారీలు.. యువకుడి మృతి

మణుగూరు జూన్ 22 (జన సంఘర్షణ)
భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇసుక మాఫియా ఆగడాలు మితిమీరిపోతున్నాయి. లారీల నిర్వాహకుల బాధ్యతారాహిత్యం, అక్రమ రవాణా దారుణాల కారణంగా ఒక నిండు ప్రాణం గాల్లో కలిసిపోయింది. అత్యవసర స్థితిలో ఉన్న రోగిని ఆసుపత్రికి తరలిస్తున్న అంబులెన్స్‌కు సైతం దారి ఇవ్వకుండా రహదారిని దిగ్బంధించడంతో ఒక యువకుడు ప్రాణాలు కోల్పోయిన విషాదకర సంఘటన మణుగూరు మండలంలో చోటుచేసుకుంది.






**అడ్డంగా నిలిపిన ఇసుక లారీలు**

జిల్లాలోని మణుగూరు మండలం సాంబాయిగూడెం నుండి రామానుజవరం వరకు గల ప్రధాన రహదారిపై ఇసుక లారీలు ఇష్టారాజ్యంగా నిలిచిపోయాయి. ఎలాంటి నిబంధనలు పాటించకుండా, ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తూ లారీ డ్రైవర్లు వాహనాలను రోడ్డుపైనే అడ్డంగా నిలిపివేయడంతో ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

**పురుగుల మందు తాగిన యువకుడు**

ఇదే సమయంలో మణుగూరు మండలం దమ్మక్కపేట గ్రామానికి చెందిన వంశీ (35) అనే యువకుడు అనివార్య కారణాల వల్ల పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ప్రాణాపాయ స్థితిలో ఉన్న అతడిని తక్షణమే వైద్యం అందించడం కోసం అత్యవసర అంబులెన్స్ వాహనంలో ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేశారు.

**దారి ఇవ్వని వైనం**

కానీ, సాంబాయిగూడెం-రామానుజవరం రహదారిపై అడ్డంగా నిలిచిన ఇసుక లారీల కారణంగా అంబులెన్స్ ముందుకు కదల్లేని పరిస్థితి ఏర్పడింది. సైరన్ మ్రోగుతున్నప్పటికీ, అత్యవసర వాహనమనే కనీస మానవత్వం కూడా లేకుండా లారీ డ్రైవర్లు అంబులెన్స్‌కు దారి ఇవ్వకుండా మొండికేసి కూర్చున్నారు. రోడ్డు పూర్తిగా బ్లాక్ కావడంతో అంబులెన్స్ అక్కడే నిలిచిపోయింది.

**భుజాలపై మోసుకెళ్లిన కుటుంబ సభ్యులు:**

అంబులెన్స్ ముందుకు వెళ్లే మార్గం లేకపోవడం, మరోవైపు వంశీ ప్రాణాలు క్షణక్షణం కొట్టుమిట్టాడుతుండటంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. సమయం మించిపోతుండటంతో చేసేదేమీ లేక, రోగిని అంబులెన్స్ నుండి దించి, తమ భుజాలపై వేసుకుని లారీల మధ్య గుండా నడుచుకుంటూ ఆసుపత్రి వైపు పరుగులు తీశారు.

**అసువులు బాసిన వంశీ**

అయితే, ప్రాణాంతక విషం తిన్న రోగికి సకాలంలో వైద్యం అందకపోవడం, భుజాలపై మోస్తూ ఆసుపత్రికి తరలించడంలో తీవ్ర ఆలస్యం కావడంతో వంశీ మార్గమధ్యలోనే కన్నుమూశాడు. ఆసుపత్రికి చేరుకునే సరికే ఆ యువకుడి ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయాయి.

**వైద్యుల స్పష్టీకరణ**

వంశీ మృతదేహాన్ని పరిశీలించిన వైద్యులు అత్యంత బాధాకరమైన నిజాన్ని వెల్లడించారు. రోగిని కనీసం ఒక అరగంట ముందు ఆసుపత్రికి తీసుకొచ్చి ఉంటే, తగిన అత్యవసర వైద్యం అందించి ఖచ్చితంగా ప్రాణాలు కాపాడేవాళ్లమని వైద్యులు స్పష్టం చేశారు. ఈ మాటలతో కుటుంబ సభ్యుల గుండెలు పగిలాయి.

**కుటుంబ సభ్యుల ఆవేదన - ఆగ్రహం**

కేవలం ఇసుక లారీల నిర్వాహకుల నిర్లక్ష్యం, రోడ్డును బ్లాక్ చేయడం వల్లే తమ బిడ్డ వంశీ ప్రాణాలు కోల్పోయాడని కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక మాఫియా అక్రమాలపై, లారీల ఆగడాలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# నేరస్తులంటే వైసిపికి మహా ప్రీతి!...టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి జూన్ 22 (జన సంఘర్షణ):
అసాంఘిక శక్తులను,కిరాయి రౌడీ మూకలను, దోపిడీ ముఠాలను ఉపయోగించి కుల, మత, ప్రాంతాల పేరుతో విద్వేషాలు రెచ్చగొట్టడం ద్వారా శాంతిభద్రతల సమస్య సృష్టించి, రాజకీయ ప్రయోజనాలు పొందడంలో సిద్ధహస్తుడైన జగన్ రెడ్డికి నేరస్తులంటే మహా ప్రీతి అని శ్రీకాళహస్తి నియోజకవర్గ, తెలుగుదేశం పార్టీ నాయకులు ఆరోపించారు. మాన ప్రాణాలను కోల్పోయిన బాధితులకు దక్కని జగన్ రెడ్డి పరామర్శ మద్దతు...నిందితులకు మాత్రం తన సంపూర్ణ మద్దతు అందిస్తారని, అందులో భాగంగానే ఇటీవల మిస్టరీగా మారిన విజయవాడకు చెందిన రౌడీషీటర్ గాదె సాయికృష్ణ అదృశ్యంపై చాలా తీవ్రంగా స్పందించిన జగన్ రెడ్డి, తన పాలనాకాలంలో అదృశ్యమైన ఎంతోమంది యువతీ యువకుల సంఘటనలపై కనీసం స్పందించలేదని ఆరోపించారు. మద్యం రవాణా ఛార్జీలను రూ. 13 నుండి రూ. 36 కు పెంచి, 'సిగ్మా' అనే పేరుతో ఏర్పాటు చేసుకున్న డొల్ల కంపెనీ ద్వారా రూ. 400 కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని నొక్కేసిన క్రిమినల్ త్రయంకారుమూరి సునీల్, నాగేశ్వరరావు, మిథున్ రెడ్డి అంటే జగన్ రెడ్డికి అత్యంత ఆత్మీయ అభిమానం ఉన్నదని ఆరోపించారు.ప్రతీ అంశాన్ని రాజకీయ కోణంలో చూసేందుకు అధిక ప్రాధాన్యత ఇవ్వడంలో జగన్ రెడ్డి అందరి కంటే ఒకడుగు ముందు ఉంటాడని, తన సొంత బాబాయ్ వివేకానంద రెడ్డి వలన తనకు రాజకీయ ఇబ్బందులు ఎదురు కాకుండా ఉండటానికి అత్యంత పకడ్బందీగా ఆయన అడ్డు తొలగించుకున్న సంఘటనను ప్రత్యర్థులపై నెట్టేయడమే కాక, పైన పేర్కొన్న నేరంలో ప్రధాన పాత్ర పోషించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న వైయస్ అవినాష్ రెడ్డిని అతని క్రిమినల్ గ్యాంగ్ లను జాగ్రత్తగా కాపాడుకుంటున్న జగన్ రెడ్డికి, క్రిమినల్ గ్యాంగ్ లకు ఉన్న అనుబంధం తెలుస్తుందన్నారు. గత వైసిపి పాలనాకాలంలో బిసి బిడ్డ లైన నందం సుబ్బయ్య, కంచర్ల జల్లయ్య, తోట చంద్రయ్య, చి!! అమర్‌నాథ్ గౌడ్, మేలుపాకు గోపీ ముదిరాజ్ లను అత్యంత కిరాతకంగా హత్య చేసిన వారికి అటు ప్రభుత్వంలో కానీ, ఇటు పార్టీలో గాని అత్యంత ఉన్నతమైన స్థానాలను కల్పించి, జగన్ రెడ్డికి నేరాల పట్ల, నేరగాళ్ళ పట్ల తనకున్న అభిప్రాయాన్ని ప్రపంచానికి తెలియజేశారని గుర్తు చేశారు.

Printed, published and owned by **Rachamallu Madhavi** Printed at **Kranthi Printing Press**, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : **Rachamallu Madhavi**. **RNI Reg No :tel/2024/89323,** Cell 6305026524, Email:janasangarshana@gmail.co